22-6Pg1exHMNWJQE.qxd:22-6Pg1exHMNWJQE.qxd 22/06/25 12:03 AM Page 1

: fb.com/vaartha Digital

WWW.VAARTHA.COM

epaper.vaartha.com

Published from Anantapur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

అనంతపురం


22-6-2025 ఆదివారం

సంపుటి: 31 సంచిక: 141

పేజీలు: 08+4 వెల: 8.00



శనివారం ఉదయం విశాఖలోని ఆర్‌కె బీచ్ వద్ద అపూర్వ రీతిలో వేలాది మందితో జరిగిన 'యోగా డే' ప్రదర్శన దృశ్యం



శనివారం విశాఖలో జరిగిన యోగా డే కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోడీ

# విశ్వమంతా మన యోగా

## 11వ సారి భారత్ బాటలో నడిచిన 175 దేశాలు

## శాస్త్రవేత్తల నుంచి దివ్యాంగుల దాకా ఒకేమాట

## ఆహారంలో నూనెలు 10 శాతం తగ్గించండి

## ఆరోగ్యభారత్‌ను ఆవిష్కరిద్దాం

## విశాఖ 'యోగాంధ్ర'లో ప్రధాని మోడీ

**విశాఖపట్నం ప్రతినిధి, జూన్ 21, ప్రభాతవార్త:** యోగా మొత్తం ప్రపంచాన్ని ఒక తాటితో బంధించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. శనివారం విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఒక గొప్ప జాతీయ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రధానమంత్రి హృదయ పూర్వకంగా ప్రశంసించారు. యోగా దినోత్సవ కార్యక్ర మంలో ప్రసంగించిన ప్రధాని

>>2



11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో జరిగిన కార్యక్రమంలో నప్రధాని మోడీకి జ్ఞాపికను అందచేస్తున్న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

# గిన్నిస్‌లో విశాఖ యోగా

**విశాఖపట్నం ప్రతినిధి, జూన్ 21, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంతర్జాతీయ యోగా కార్యక్రమం విశాఖ సాగర తీరాన చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించింది. విశాఖ సిగలో సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. 11వ అంత ర్జాతీయ యోగా దినోత్స వాన్ని పురస్కరించుకొని విశాఖపట్న వేదికగా నిర్వహించిన ఈ బృహత్ యోగా ప్రదర్శన గిన్నెస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది.

>>2

# యోగాంధ్ర.. ఓ చరిత్ర

## ప్రధాని మోడీ చొరవతో యోగాకు ప్రపంచ గుర్తింపు

## ఒలింపిక్స్, కామన్వెల్త్‌లో కూడా యోగాను ప్రవేశపెట్టాలి

## సెప్టెంబర్‌లో యోగా సూపర్ లీగ్ ఆరంభం

## విశాఖ'యోగాడే'లో 3లక్షల మందిపైగా పాల్గొనడం విశేషం

## 11వ అంతర్జాతీయ యోగా వేడుకలో సిఎం చంద్రబాబు

**విశాఖపట్నం, జూన్ 21 ప్రభాతవార్త:** యోగా సాధన మానసిక, శారీరక ఆరోగ్యానికి మార్గం చూపుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ ఆర్కే బీచ్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అంతకుముందు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి చంద్రబాబు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 'దేశం,ప్రాంతం, మతం, భాషతో సంబంధం లేకుండా యోగాకు ఆమోదం లభిం చింది. శరీరం, మనస్సు,

>>2

# ఆస్పత్రికి చెవిరెడ్డి

**విజయవాడ,జూన్21,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన ఆయన జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అయితే ఈరోజు శనివారం ఉదయం గుండెలో నొప్పిగా ఉందని చెప్పడంతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ముందుగా జైలులో ఉన్న వైద్యులతో పరీక్షలు చేయించారు. ఆపై ముందస్తు జాగ్రత్తగా ఆయనను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజియోథెరపీలో మాజీ ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు నిర్వహించారు డాక్టర్లు. వైద్య పరీక్షలు పూర్తిఅయ్యాయి. ఈరోజు సాయంత్రం

>>2

# కుప్పం మహిళపై దాడి ఉదంతం ఎన్‌హెచ్‌ఆర్‌సి సుమోటో విచారణ

**విజయవాడ,జూన్ 21,ప్రభాతవార్త ప్రతినిధి:** అప్పు చెల్లించలేదని కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటనపై మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా జాతీయ మానవ హక్కుల సంఘం సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ ఘటనపై రెండు వారాల్లోపు నివేదిక సమర్పించాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను ఆదేశించింది. 'మీడియాలో వచ్చిన కథనం ప్రకారం భాథితురాలి భర్త వడ్డీ వ్యాపారి నుండి రూ.80,000 అప్పు తీసుకొని చెల్లించడంలో విఫలమయ్యారు. గ్రామంలోని ఇతరుల వద్ద అప్పులు చేసి వాటిని తిరిగి చెల్లించలేక పరారయ్యారు.

>>2

## 5 రోజుల పనిదినాలు

# మరో యేడాది పొడిగింపు

**విజయవాడ,జూన్21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని ప్రాంతంలో రాష్ట్రస్థాయి కార్యాలయాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు వారంలో 5 రోజుల పనిదినాలను ప్రభుత్వం మరో యేడాది పొడిగించింది. రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు సహా విభాగాధిపతులు, కార్పొరేషన్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రస్తుతం వారంలో 5రోజుల పనిదినాలు అమల్లో ఉన్నాయి. ఈ నెల 26తో గడువు ముగియనుండగా ఆఉత్తర్వులను పొడిగిస్తూ

>>2

# జాతీయ రోడ్లకు కొత్తరూపు

## రూ.12,152 కోట్లతో 457 కి.మీ అభివృద్ధి

## రూ.100కోట్లతో వంతెనల నిర్మాణం



**విజయవాడ,జూన్21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో జాతీయ రహదారులకు మంచి రోజులు వచ్చాయి. ఈ రోడ్డుల విస్తరణకు అభివృద్ధికి కేంద్ర భారీగా నిధులు మంజూరు చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు జాతీయరహదారుల్లో కొన్ని అయిదు మీటర్లకే పరిమితమై ఉన్నాయి. ఈ రోడ్ల విస్తరణపై సుదీర్ఘకాలం నుంచి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతున్న పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో 10 మీటర్ల వెడల్పుతో 2 వరుసలుగా, మరికొన్నింటిని 4 వరుసలుగా పెంచేందుకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) భారీగా నిధులు మంజూరు చేసింది. 457 కిలోమీటర్ల హైవేల పనులకు రూ.12,152 కోట్లతో 2025- 26 వార్షిక ప్రణాళికను కేంద్రం ప్రకటించింది. వీటిలో సుదీర్ఘ కాలం నుంచి విస్తరణ కోసం ఎదురుచూస్తున్న హైవేలు, వంతెనలు, రైల్వే క్రాసింగ్స్ వద్ద ఆర్వోబీలు ఉన్నాయి. ఇప్పుడు వీటన్నింటికీ మోక్షం కలిగింది. చాలా వరకు డబుల్‌లైన్లు 4 వరుసల రోడ్లుగా మారనున్నాయి. కృష్ణా జిల్లా పెడన నుంచి గుడివాడ, హనుమాన్ జంక్షన్, నూజివీడు, విస్సన్నపేట మీదగా ఎన్టీఆర్ జిల్లా లక్ష్మీపురం వరకు ఉన్న నేషనల్ హైవే216హెచ్‌ని రూ.4,245 కోట్లతో 4 వరుసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇది కత్తిపూడి ఒంగోలు హైవేలో పెడన వద్ద మొదలై, ఇబ్రహీంపట్నంజగదల్‌పూర్ హైవేలో లక్ష్మీపురం వద్ద కలుస్తుంది. మొత్తంగా 118 కిమీ విస్తరించనున్నారు. పామర్రు నుంచి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు సమీపంలో దిగమర్రు వరకు ఉన్న హైవే165లో ఆకివీడు నుంచి దిగమర్రు మధ్య 45 కిమీ 4వరుసలుగా విస్తరించేందుకు ఆమోదం తెలిపారు. దీనికి రూ.2,500 కోట్లు కేటాయించారు. వైఎస్సార్ కడప జిల్లాలో ముద్దనూరు నుంచి కడప వరకు ఉన్న ఎన్‌హెచ్ 716లో 48 కిమీ 4 వరుసలుగా మార్చనున్నారు. దీనికి రూ.1,182 కోట్లు కేటాయించారు. శ్రీసత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ నుంచి కదిరి వరకు 22 కిమీ హైవేని 4 వరుసల విస్తరణకు రూ.428 కోట్లు కేటాయించారు. మచిలీపట్నం నుంచి పోర్టు వరకు ఉన్న 8 కిమీ హైవేని 4 వరుసలుగా విస్తరణకు రూ.584 కోట్లు కేటాయించగా, ఈ మార్గాన్ని 6 వరుసలుగా విస్తరణకు పరిశీలించాలని కేంద్రం సూచించింది.

కడపరాయచోటి హైవేలో గువ్వలచెరువు ఘాట్ కష్టాలు తీర్చేందుకు అక్కడ 8 కిమీ మేర 4 వరుసల రహదారితో కూడిన సొరంగం నిర్మాణానికి రూ.920 కోట్లు కేటాయించారు.

అమలాపురం నుంచి రావులపాలెం వరకు 7 మీటర్ల వెడల్పుతో ఉన్న 32 కిమీ హైవేని 10 మీటర్ల వెడల్పుతో విస్తరించేందుకు రూ.735 కోట్లు కేటాయించనున్నారు. వీటిని 10మీటర్లుకు విస్తరించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. జీలుగుమిల్లికొవ్వూరు హైవేలో 86 కి.మీ. ఉండగా, ఇందులో ఇప్పటికే 40కిమీ 2 వరుసలుగా విస్తరణ చేపట్టారు. ఇందులో మిగిలిన 46కిమీవిస్తరణకు రూ.495కోట్లు కేటాయించారు.

తెలంగాణలోని కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు ఉన్న హైవే167కేలో నంద్యాల జిల్లా పరిధిలోని నల్లకాలువవెలుగోడు మధ్య 17 కిమీ 10 మీటర్ల వెడల్పుతో 2వరుసలుగా విస్తరించనున్నారు. దీనికి రూ.400 కోట్లు కేటాయించారు. ఎమ్మిగనూరు వద్ద రూ.225 కోట్లతో 9 కిమీ బైపాస్ నిర్మిం చనున్నారు. ఇదే సందర్భంలో కేంద్రం మరో నిర్ణయం తీసుకుంది, వంతెనల నిర్మాణం, అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిం చింది. బాపట్ల జిల్లా గూడవల్లి వద్ద లోలెవెల్ బ్రిడ్జికి రూ.21 కోట్లు, పల్లెకోన వద్ద వంతెనకు రూ.4 కోట్లు కేటాయించారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ వద్ద రైల్వేగేట్ ఉన్నచోట వంతెన నిర్మాణానికి రూ.50 కోట్లు వెచ్చించను న్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని వార్షిక ప్రణాళికలో చేర్చిన ప్రాజెక్టులకు ఈ అర్థిక సంవ త్సరం అంటే 2025-26 మార్చి 31లోపు సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్‌లు) సిద్ధం చేసి, మోర్త్ ఉన్నతాధికారుల వద్ద సాంకేతిక అనుమతులు తీసుకోవాలి. తర్వాత ఆర్థికపరమైన క్లియరెన్స్ ఇస్తారు. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తారు.

# నాలుగు రోజులు వర్ష సూచన

**విజయవాడ,జూన్21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో రానున్న నాలుగు రోజులు వర్షాలు కురుస్తాయని వాతా వరణ శాఖ తెలిపింది. శనివారం ఉత్తర కోస్తాంధ్ర, యానాంలలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. పలుప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందని తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో గాలివేగం గంటకు 40 నుంచి 50 కి.మీ ఉంటుందని తెలిపింది. ఇక, దక్షిణ కోస్తాంధ్రలో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని చెప్పింది. అలాగే కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత కూడా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

రాయలసీమలో ఈరోజు కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. అలాగే కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత కూడా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రజలకు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కీలక సూచన చేసింది. అల్లూరి సీతారామరాజు, అనకా పల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్

>>2

## వృద్ధులు, దివ్యాంగులకు

# 5 రోజుల ముందే రేషన్

## మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ,జూన్21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 65 ఏళ్ళు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఐదు రోజుల ముందే ఇళ్ళ దగ్గరకు తీసుకెళ్ళి రేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే జులైలో ఇవ్వాల్సిన రేషన్ జూన్ 26వ తేదీ నుండి డీలర్ల ద్వారా పంపిణీ చేస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఏండీయు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ విధానాన్ని రద్దు చేసిన ప్రభుత్వం...జూన్ నుంచి డీలర్ల ద్వారా పంపిణీ ప్రారంభించింది. 13.14 లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ళ వద్ద ఇచ్చారు. రేషన్ సంస్కరణల్లో భాగంగా ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ లోపు వృద్ధులు,దివ్యాంగులకు ఇళ్ళ వద్ద రేషన్ అందించాలని నిర్ణయించామని శుక్రవారం తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో కొండలపై ఉన్న వారికి సరుకులు అందించడంలో డీలర్లు మరింత చొరవ తీసుకోవలని సూచించారు. విజయవాడ లోని పౌరసరఫరాల శాఖ కమీషరేట్‌లో రేషన్ పంపిణీపై డీలర్లతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ సహాయంతో రేషన్ డీలర్ల ఆదాయం పెంచేందుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. దుకాణంలో శుభ్రత పాటించాలని, బయట బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సన్న బియ్యం పండించేలా రైతుల్ని ప్రోత్సహించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైస్‌మిల్లర్లను కోరారు. పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో మిల్లర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సన్నబియ్యాన్ని ప్రోత్సహిస్తోంది. బియ్యం ఎగుమతులపైనా దృష్టి పెట్టాలి అని సూచించారు.



శనివారం విశాఖలో మంత్రి లోకేష్‌ను అభినందిస్తున్న ప్రధాని మోడీ

# తండ్రికి తగిన తనయుడివి..

## మంత్రి లోకేష్‌ను ప్రశంసించిన ప్రధాని మోడీ

**విశాఖపట్నం ప్రతినిధి, జూన్ 21, ప్రభాతవార్త:** అధ్భుతమైన ఏర్పాట్లు.. అశేష ప్రజానీకం.. లక్షలాది మందితో యోగా.. నాయకత్వ లక్షణాలు తండ్రికి తగ్గ తనయుడు అని నిరూపించారు అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ప్రశంసించారు. అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ప్రధాని వైజాగ్‌లో ఏర్పాట్లు, జన సమీకరణ చూసి ఆనందభరితులయ్యారు. తాను అధికారంలోకి ఉన్న 11ఏళ్లలో ఏ రాష్ట్రంలో లేని విధంగా

>>2



డిజిపి కార్యాలయంలో యోగా దినోత్సవంలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

## డిజిపి కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**విజయవాడ,జూన్21,ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆంధ్రప్రదేశ్ పోలీస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భారీ ఎత్తున పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియచేశారు. ఉదయం 6:30 గంటలకు పోలీసు ప్రధాన కార్యాలయ జంక్షన్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువుల పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది పలు యోగాసనాలను గంట సేపు పాటు అభ్యసించారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు పాల్గొనేలా నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది భారీఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆకె రవి కృష్ణ ఐజీపీ (ఈగల్ ), భద్రత సెక్రటరీ హరి కుమార్ ఐజీపీ(రిటైర్డ్), సీఈవో రాజన్ తదితరులు పాల్గొన్నారు.. .రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల పోలీసు ప్రధాన కార్యాలయాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

# రాష్ట్రమంతా ఉత్సాహంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాలు

**విజయవాడ,జూన్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 11 వ ప్రపంచ యోగా దినోత్సవాన్ని సందర్భంగా రాష్ట్రంలో సాధారణ గ్రామ స్థాయి నుంచి నగర స్థాయి వరకు ఘనంగా నిర్వహించారు.గత నెల 21 నుంచి రాష్ట్రమంతటా యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విశాఖ నగరంలో అత్యంత భారీ స్థాయిలో ప్రపంచ యోగా డేని నిర్వహించారు.3.50లక్షల మందికిపైగా ఏక కాలంలో విశాఖలో యోగా నిర్వహించి రెండు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులు సాధించారు.ప్రధాని నరేంద్రమోడీ,ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్,సీఎం చంద్రబాబు,డీసీఎం పవన్ కల్యాణ్,మానవ వనరుల శాఖా మంత్రి నారాలోకేష్‌తో పాటు పలువురు మంత్రులు.ప్రజాప్రతినిధులు, యోగాలో ప్రపంచ ప్రఖ్యాతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఇదే సమయంలో ఏపీ అంతటా యోగా డేని నిర్వహించారు.. యోగా ఫర్ వన్ ఎర్త్‌వన్ హెల్త్ నినాదంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యోగా డే ను నిర్వహిస్తూ విస్తృత ఏర్పాట్లు చేసింది. వేకువజాము నుంచే ఔత్సాహికులు కార్యక్రమాల్లో పాల్గొని యోగాసనాలు వేశారు. విజయవాడలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన యోగా వేడుకల్లో వేలాదిమంది విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఏపీ ఎన్జీజీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ యోగాభ్యసనాలు వేశారు.గుంటూరు జిల్లా మంగళగిరిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో దాదాపు 500 మంది యోగాసనాలు వేశారు. మంగళగిరి,తాడేపల్లి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులు, మహిళలు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్నారు.వైఎస్ఆర్ కడప జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా అభ్యాసాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. రాజకీయ ప్రముఖులు, అధికారులు, విద్యార్థులు, పుర ప్రజలు హాజరై



విజయవాడలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

యోగాసనాలు వేశారు. విశాలమైన మైదానంలో ఐదు వేల మందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతపురంలోని పిటిసి మైదానంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 5000 మంది విద్యార్థులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు హాజరై యోగాసనాలు వేశారు. ఉరవకొండ ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. క్రికెట్ స్టేడియంలో యోగాంధ్ర మసోత్సవాల ముగింపు కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. సుమారు 5 వేల మంది నగరవాసులు యోగా గురువు సూచనల మేరకు యోగాసనాలు చేశారు. బద్వేల్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రితేశ్ రెడ్డి కూటమి నాయకులు రోషన్న ఆర్డీఓ చంద్రమోహన్ డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పురపాలక కమిషనర్ నరసింహారెడ్డి శాఖ అధికారులు విద్యార్థులు యోగా ఆసనాలను వేసి ప్రత్యేకతను చాటారు.

కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ ప్రాంగణం యోగాసనాలతో కళకళలాడింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఔత్సాహికులు ఉత్సాహంగా పాల్గొని ఆసనాలు వేశారు. పంచలింగాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. నెల్లూరు జిల్లాలోని అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "యోగాంధ్ర" అనే ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టడం దేశం గర్వించదగ్గ విషయం అని మంత్రి ఆనం తెలిపారు.ఆత్మకూరు నియోజకవర్గం చేజర్ల మండల పరిధిలోని పెరుమళ్లపాడు వ్యవసాయ క్షేత్రంలో మంత్రి ఆనం ధ్యానం, యోగాసనాలు చేశారు. యోగ అనేది శారీరకంగా, మానసికంగా దృఢంగా నిలబెట్టే ప్రాచీన భారతీయ సంపద అని ఆయన అన్నారు.

# తిరుమల సమాచారం

## బహ్రాయిన్‌లో వేడుకగా శ్రీనివాసకల్యాణం

**తిరుమల,జూన్ 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామికి జరిపించే రీతిలోనే మధ్యతూర్పులోని ద్వీపదేశం బహ్రాయిన్‌లో శ్రీవారి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. శ్రీవేంకటేశ్వర సాంస్కృతిక సంస్థ బహ్రాయిన్ ఆధ్వర్యంలో సల్మాబాద్‌లోని గోల్డెన్‌ఈగల్ హెల్త్ క్లబ్‌లో కల్యాణ మహోత్సవాన్ని టిటిడి వేదపండితులు ఆగమోక్తంగా నిర్వహించారు. టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. కల్యాణవేడుకల పెద్దసంఖ్యలో ప్రవాస భారతీయులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.ఈ సందర్భంగా తిరుమల నుండి తీసుకెళ్ళిన శ్రీవారి లడ్డూప్రసాదాలను అక్కడ భక్తులకు పంపిణీ చేశారు.

అంతకుముందు శ్రీవారికి సుప్రభాతసేవ, కొలువు, తోమాల, అర్చన, అభిషేకం తిరుమల ఆలయంలో తరహాలోనే ఆలయ అర్చకులు సేవలు నిర్వహించి ప్రవాస భారతీయుల భక్తులకు దర్శనం కల్పించారు.

## ఉన్నతంగా ఉండేందుకు 'యోగా' అంతర్గత పాఠాలు

- యోగాతో మానసిక ఒత్తిళ్లు దూరం
- టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,జూన్ 21ప్రభాతవార్తప్రతినిధి:** సమాజంలో ఎలా ఉండాలనే అంశాలపై జ్ఞానవంతమైన, ఉన్నతమైన మార్గం తెలియజేసేలా అంతర్గతపాఠాలు యోగాతో నేర్చుకుంటామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజూ యోగాను దినచర్యగా పాటించాలని ఆయన సూచించారు. యోగాతో ఆధ్యాత్మికత, మానసిక ఒత్తిళ్ళు, శారీరకంగా తదితర అంశాలను నియంత్రణలో ఉంచుకునేలా దోహదపడుతుందన్నారు. అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవంసందర్భంగా శనివారం ఉదయం తిరుమల తిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో టిటిడి పరిపాలన భవనం మైదానంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి ,బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి,సిఇ సత్యనారాయణ, రవాణా జిఎం శేషారెడ్డి, విఎస్ఒలు ఎన్టీవిరామ్‌కుమార్, సదాలక్ష్మి, సురేంద్ర,ఏవిఎస్ఒ రమేశ్, టిటిడి ఉద్యోగులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా అదనపు ఇఒ మాట్లాడుతూ మానవసమాజంలో ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా నియంత్రణలో ఉండటం యోగాతోనే సాధ్యమవుతుందన్నారు. విశ్వవ్యాప్తంగా 190 దేశాల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా యోగా ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం గిన్నీస్‌బుక్ రికార్డులో నమోదు కావడం గర్వించదగిన విషయమన్నారు. ప్రపంచవ్యాప్తంగా యోగాను మరింత ప్రాధాన్యత పెంచేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ,సిఎం చంద్రబాబునాయుడు యోగా దినోత్సవం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

## అలిపిరి ప్రవేశద్వారానికి కొత్త ఆధ్యాత్మిక శోభ !

కొత్త డిజైన్లతో మహామండపం తరహాలో మార్పులు



**తిరుమల,జూన్ 21ప్రభాత వార్తప్రతి నిధి:** కలియుగ వైకుంఠం తిరు మలకు ప్రతినిత్యం లక్షమంది వరకు వస్తున్న భక్తులు తొలుత ప్రవేశించే ప్రధాన ద్వారం అలిపిరికి కొత్త ఆధ్యాత్మిక శోభ తీసుకువచ్చేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రణాళికలు సిద్ధంచేసింది. తిరుమల క్షేత్రం వైభవాన్ని అలిపిరిలోనే భక్తులు తెలుసుకునేలా బేస్‌క్యాంప్ ఏర్పాటుతోబాటు మహామండపంలోకి వచ్చేలాగా అనుభూతి కలిగించేలా కొత్త డిజైన్లతో మార్పులు చేయనుంది. ఈ బాధ్యతలను టిటిడి బోర్డుసభ్యుడు, ఆర్కిటెక్ ఆనందసాయికి టిటిడి పాలకమండలి అప్పగించింది. ప్రస్తుతం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పేరును తిరుపతి(రేణిగుంట)లోని విమానాశ్రయానికి మార్పుచేస్తూ టిటిడి పాలకమండలి కేంద్రానికి ప్రతిపాదనలతో నివేదించిన విషయం విదితమే. తిరుపతి విమానాశ్రయం,అలిపిరి ప్రవేశద్వారం ఆర్చ్‌కు కొత్తరూపు తీసుకువచ్చేలా టిటిడి నిర్ణయం అభినందించదగిన విషయంగా మారింది. తిరుమల ఐకానిక్‌గా ఆధ్యాత్మికశోభను తీసుకువచ్చేందుకు టిటిడి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వాటి డిజైన్లలో పేరెన్నికగన్న ఆర్ట్‌డైరెక్టర్, టెంపుల్స్ ఆర్కిటిక్ ఆనందసాయి బాధ్యతలు తీసుకున్నారు. దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న ప్రయాణీకుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో విమానాశ్రయంలోనూ తిరుమల శోభ కనిపించేలా మార్పుచేయనున్నారు. అలిపిరిలో మొదట ఉన్న గరుడవిగ్రహం కూడలిలోని ఆర్చిని ఆధునీకరించాలని ఆలోచనతో టిటిడి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల కొంతకాలం క్రిందట కాలినడకన అలిపిరి నుండి తిరుమలకు చేరుకున్నఆనందసాయి అలిపిరి నుండి ఆనందనిలయం వరకు చేపట్టాల్సిన అభివృద్ధి, ఆధ్యాత్మిక వాతావరణంపై చర్చించారు.రోజువారీగా లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తుంటే ఇందులో 20వేలమంది కాలినడక మార్గాల్లో, 60వేలమంది వరకు భక్తులు వాహనాల్లో ఘాట్‌రోడ్లపై ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో భక్తులు ఒక అనుభూతిచెందేలా మార్పులు జరగనున్నాయి.

## శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది : నటి దివి



**తిరుమల,జూన్ 21ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని, స్వామివారి ఆశీస్సులందుకున్నానని టాలీవుడ్ నటి ,బిగ్‌బాస్‌ఫేం దివివద్యా తెలిపారు. ఆమె ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకుంది. ఆలయ అధికారులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చినదివితో అభిమానులు సెల్ఫీలు తీసుకున్నారు.స్వామివారిపై తనకున్న భక్తిని చెప్పుకుంది. తన మనసుకు చిన్నపాటి కష్టమొచ్చినా శ్రీవారే తనదగ్గరకు పిలుచుకుంటాడని విశ్వాసం వ్యక్తం చేసింది.

## ముందస్తు బెయిల్‌కు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిటిషన్

**విజయవాడ,జూన్21,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన (ఎ-39) చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి (చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు) తనకు ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ విజయవాడ ఎసిబి కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈ కేసులో సిట్ అధికారులు తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని,అందుకే ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై న్యాయస్థానం విచారణ జరుపనుంది.ఇక ఇదే కేసులో మద్యం కుంభకోణం కేసులో అరెస్టై జైలులో ఉన్న వై కాంగ్రెస్‌పార్టీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి తనకు ఇంటి నుంచి ఆహారం తెప్పించు కునేందుకు అనుమతివ్వాలని కోరుతూ విజయవాడ లోని ఏసిబీ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో అరెస్ట్ అయిన మరో నిందితుడు. వెంకటేష్ నాయుడు తనకు మంచం,దిండు, దుప్పటితో పాటు ఇంటి నుంచి ఆహారం తెప్పించుకునేందుకు అనుమతివ్వాలంటూ పిటీషన్ దాఖలు చేశారు.

# భవన నిర్మాణ కార్మికులకు లేబర్ చౌక్‌లు

విశాఖ, విజయవాడలో ప్రయోగాత్మకంగా ఎంపిక

ఒక్కో నగరంలో పది చొప్పున అభివృద్ధి చేసేలా ప్రణాళిక

**విజయవాడ,జూన్ 21,ప్రభాతవార్త ప్రతినిధి:** భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం రోజూ ఉదయం రోడ్ల పక్కన ఇక వేచి చూడాల్సిన పని లేదు. వీరందరి కోసం విశాఖపట్నం,విజయవాడలలో ప్రయోగాత్మకంగా ఒక్కో నగరంలో పది చొప్పున లేబర్ చౌక్‌లు అభివృద్ధి చేయనున్నారు. కార్మికుల సేవలు అవసరమైన ప్రజలు నేరుగా లేబర్ చైక్‌కు వెళ్ళి సంప్రదించవచ్చు. కార్మికులకు పక్కా చిరునామా, వీరందరికోసం తగిన సదుపాయాలతో ప్రత్యేకంగా భవనం అవసరమన్న ఉద్దేశ్యంతో దేశవ్యాప్తంగా 25 నగరాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. వాటిలో రాష్ట్రం లోని విశాఖపట్నం,విజయవాడకు చోటు దక్కింది. ఈ రెండు చోట్ల భవన నిర్మాణ,ఇతర అసంఘటిత కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు కేంద్రం గుర్తించింది. రెండు చోట్ల కలిపి మొత్తం 20 లేబర్ చౌక్‌లు అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు అవసరమైన స్థల సేకరణ చేయాలని నగరపాలక సంస్థల కమీషనర్లను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల పైనే భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వీరితో అత్యధికంగా విశాఖపట్నం,విజయవాడ,గుంటూరు, తిరుపతి,కర్నూలు,నెల్లూరు, కాకినాడిలో ఉన్నట్లు గుర్తించారు.ఇప్పటి వరకు వీరంతా ప్రధాన కూడళ్ళలో రోజూ ఉదయమే చేరి అక్కడి నుండి పనులకు వెళుతున్నారు. విశాఖ,విజయవాడలో ఏర్పాటు చేయనున్న లేబర్ చౌక్‌లలో మౌలిక సదుపాయాల కల్పనకు జాతీయ పట్టణ ఉపాధి కల్పన మిషన్(ఎన్‌యూఎల్‌ఎం) కింద రూ.15 లక్షల చొప్పున ఖర్చు చేయనున్నారు. వీటిలో తాగునీటి సదుపాయం,పురుషులు,మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు,100 నుంచి 200 మంది కూర్చోడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తారు. నెలాఖరులోగా స్థలాల ఎంపిక పూర్తి చేసి లేబర్ చౌక్‌లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.మహిళ స్వయం సహాయక సంఘాల మాదిరిగా భవన నిర్మాణ కార్మికుల్లో పురుషులతోనూ పొదుపు సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. గరిష్టంగా 10-12 మందితో ఒక్కో సంఘాన్ని ఏర్పాటు చేసి వారితో నెలకు రూ.వంద చొప్పున పొదుపు చేయించనున్నారు. 3 నుంచి 6 నెలల తర్వాత పొదుపు సంఘాలకు ప్రభుత్వం రివాల్వింగ్ ఫండ్ ఇస్తుంది. 6 నెలల తర్వాత బ్యాంకు లింకేజి ద్వారా ఒక్కో సంఘానికి రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు వడ్డీ లేని రుణాలు ఇప్పిస్తారు.

## బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు కింద సీట్ల కేటాయింపు

**విజయవాడ,జూన్21,ప్రభాతవార్తప్రతినిధి:** బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు (ఆర్టీఈ) చట్టం 12(1) సి ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు సంబంధించి రెండవ విడత లాటరీ ఫలితాల తుది జాబితా శుక్రవారం (20-6-25)విడుదల చేసినట్లు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా 8,583 విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన విద్యార్థుల సమాచారం తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియచేయడంతో పాటు హెచ్‌టిటిపి//సిఎస్ఇ.ఎపి.జిఓవి. ఇన్/వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. పాఠశాలలకు కేటాయించిన విద్యార్థులు తగిన ధృవీకరణ పత్రాలతో 21.06.2025 నుండి 28.06. 2025 లోపు సంబంధిత పాఠశాలలకు వెళ్ళి తమ ప్రవేశాలను నిర్ధారించుకోవచ్చు. పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నెంబరు 1800 4258599 సంప్రదించవచ్చు. సం బంధిత పాఠశాల యాజమాన్యాలు ధృవీకరణ పత్రాలను పరిశీలించి అడ్మిషన్లు ఇవ్వాలని తెలిపారు. సరైన కారణం లేకుండా పాఠశాల యాజమాన్యం అడ్మిషన్లు నిరాకరిస్తే, శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అడ్మిషన్లను సమగ్ర శిక్షా ఇల్లా అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్లు (ఏపీసీలు)కు ప్రత్యేకంగా కేటాయించిన లాగిన్ల ద్వారా నిర్ధారిస్తారు.

పాఠశాల యాజమాన్యాలకు సందేహాలుంటే సంబంధిత ఎంఈవో, డిఈఓ, ఆర్జెడీలను సంప్రదించాలన్నారు. తొలి విడతలో ఒకటో తరగతిలో ప్రవేశాల దరఖాస్తులు మే 2 నుండి మే 19 వరకు స్వీకరించగా, 37,427 మంది పిల్లలు నమోదు చేసుకున్నారని తెలిపారు. తొలి విడత కింద అర్హత దశల ధృవీకరణ ద్వారా 28,561 మంది అర్హత సాధించారు. వీరిలో మొదటి విడత లాటరీలో 23,118 మందికి సీట్లు కేటాయించగా 15,541 మంది పాఠశాలల్లో చేరారు.

# యోగా శరీరం, మనసు, ఆత్మకు సమతుల్యతను కలిగించే జీవన విధానం

- కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డా. పి. క్రిష్ణయ్య



**విజయవాడ,జూన్21,ప్రభాతవార్తప్రతినిధి:** యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది శరీరం, మనసు, ఆత్మకు సమతుల్యతను కలిగించే జీవన విధానం అని అన్నారు ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డా. పి. క్రిష్ణయ్య. పదకొండో ప్రపంచ యోగా దినోత్సవం సంధర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం ఏపిఐఐసీ కాలనీలోని మున్సిపల్ పార్క్ లో ఆయన మెంబర్ సెక్రటరీ శ్రీ శరవణ్ , సిబ్బందితో కలిసి యోగా సాధన చే శారు. విజయవాడకు చెందిన ప్రకృతి వైద్యులు డా. మంతెన సత్యనారాయణ రాజు గారి సిబ్బంది పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకృతి ఆశ్రమం లో అందించే ఉప్పు, నూనె లేని అల్పాహారాన్ని పీసీబీ సిబ్బందికి అందించారు. ప్రతి రోజు కొంత సమయం కేటాయించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు అవయవాలకు రక్త ప్రసరణ మెరుగ్గా అవుతుందని పేర్కొన్నారు. నిత్యం ఏంతో ఒత్తిడి ని ఎదుర్కొనే వుద్యోగులు తమ కోసం తాము ఆలోచించుకుని ప్రతి రోజు యోగా చేస్తే అటు వృత్తిగతంగానూ , ఇటు వ్యక్తిగతంగానూ మేలని సూచించారు. ప్రభుత్వం సూచించింది కదా అని తేలిగ్గా తీసుకోకుండా, ప్రతి ఒక్కరూ బాధ్యతగా యోగా సాధన చేస్తే త్వరలోనే మన రాష్ట్రం ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ అవుతుందని కాంక్షించారు.నిపుణుల సమక్షంలో యోగాసనాలు అభ్యసించడం ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిపీసీబీ వున్నతాధికారులు, జోనల్, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టులో ఘనంగా అంతర్జాతీయ యోగా వేడుకలు

**విజయవాడ జూన్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర హైకోర్టులో 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, న్యాయాధికారులు, న్యాయవాదులు మరియు హైకోర్టు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని యోగా మాస్టర్స్ సూచనల మేరకు పలు రకాల యోగాసనాలను అభ్యసించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా హైకోర్టు పని వేళలు ముగుస్తున్న సమయంలో వీరంతా పలు రకాల యోగసనాలను అభ్యసిస్తూ ప్రపంచ యోగా దినోత్సవ సమ్మేళనానికి తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక లక్షకు పైగా ప్రాంతాల్లో 2 కోట్ల మంది ప్రజలు పాల్గొనేలా నిర్వహించిన ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర హైకోర్టు కూడా ఒక వేదిక అయ్యింది.

న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, న్యాయాధికారులు, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.రఘువీర్, న్యాయవాదులు మరియు హైకోర్టు ఉద్యోగులు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# ప్రెస్‌క్లబ్ ప్రతిష్టను దెబ్బతీస్తున్న వారిపై చర్యలు తీసుకోండి!

- డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎపియూడబ్ల్యూజె నేతల వినతి

**విజయవాడ, జూన్ 21:** ఏపీయూడబ్ల్యూజే యూనియన్, ప్రెస్ క్లబ్ పై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తూ , ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న నలుగురిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యూనియన్ నాయకులు శనివారం డిప్యూటీ పోలీస్ కమిషనర్ కె.జీ.వి. సరితకు వినతి పత్రం అందించారు. ఏపీయూడబ్ల్యూజే కార్యాలయమైన ప్రెస్ క్లబ్ వ్యవహారంలో ఇతర యూనియన్లకు చెందిన కొందరు వ్యక్తులు రెండేళ్లుగా చేస్తున్న దుష్ప్రచారాలను వివరించారు ఇతర యూనియన్లకు విజయవాడ ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం ఇవ్వడం అనేది బైలాస్ ప్రకారం సాధ్యం కాదని డీసీపీకి వివరించారు. అయినప్పటికీ ఇతర యూనియన్ల వారికి కూడా సభ్యత్వం ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే , ప్రెస్ క్లబ్ సంస్థలను కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా అప్రతిష్ట పాలు చేస్తూ వాట్సాప్ గ్రూపులలో తప్పుడు పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాక ప్రెస్ క్లబ్ కి వ్యతిరేకంగా మున్సిపల్ కార్పొరేషన్ కి, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కి తప్పుడు ఫిర్యాదులు చేసి బెదిరింపులకు పాల్పడు తున్నారని తెలియజేశారు. ఆయా డిపార్ట్మెంట్ ల వారు ఫిర్యాదులపై విచారణ జరిపే సందర్భంలో కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులపై కూడా వీరు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ ఆయా అధికారులను కూడా బ్లాక్ మెయిల్ చేస్తున్నారని వెల్లడించారు. నలుగురు వ్యక్తులు ఒక గ్యాంగు లాగా ఏర్పడి ఎంతో చరిత్ర కలిగిన విజయ వాడ ప్రెస్ క్లబ్ పై వాట్సాప్ గ్రూపులు అడ్డా గా చేసుకుని దుష్ప్రచారానికి పాల్పడు తున్నారని డీసీపీకి వివరించారు. ఈ గ్యాంగ్ లో సభ్యులుగా వీర్ల శ్రీరామ్ యాదవ్, ప్రసాద్ బాబు, ఏవివి శ్రీనివాసరావు, కస్తాల నమ్మయ్యలు ఉన్నారని, వీరందరికీ సొంతగా వేరువేరు యూనియన్లు ఉన్నప్పటికీ ఒక గ్రూపు లాగా మారి ప్రెస్ క్లబ్ పై బెదిరింపులకు పాల్పడుతూ దుష్ప్రచారం చేస్తున్నారని తెలియజేశారు. వాట్సప్ గ్రూపులను దుర్వినియోగం చేస్తూ యూనియన్, ప్రెస్ క్లబ్ ప్రతిష్టను దురుద్దేశపూర్వకంగా దెబ్బతీస్తూ బెదిరింపులకు పాల్పడుతుండడం మరియు



డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీసుకు ఏపీయూడబ్ల్యూజే నేతల వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

అధికారులపై తప్పుడు ఫిర్యాదులు చేస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్న సదరు వ్యక్తులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీసీపీకి విజ్ఞప్తి చేశారు. డీసీపీని కలిసిన వారిలో యూనియన్ అర్బన్ అధ్యక్షుడు చావా రవి, కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి డి. నాగరాజు ఉన్నారు.

## రౌడీషీటర్లకు జగన్ పరామర్శలేంటి? : జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

**విజయవాడ,జూన్21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన వ్యక్తి ఆడవాళ్ళను ఇబ్బంది పెట్టే రౌడీషీటర్ల ఇంటికి వెళ్ళి పరామర్శలు చేయడం ఏంటి? శాంతి భద్రతలను పరిరక్షించే పోలీసు వ్యవస్థను,పోలీసు అధికారులను బహిరంగంగానే బెదిరించడం ఏమిటి? వైకాంగ్రెస్‌పార్టీ దాష్టీకాన్ని ప్రజలు చూసి విసిగిపోయి ఎన్నికల్లో గట్టిగా బుద్ది చెప్పారు. ఇప్పటికీ ఆ నాయకులు తమ తప్పు తెలుసుకోకుండా దాష్టీకం ప్రదర్శిస్తూనే ఉన్నారు' అని జనసేన ఎంఎల్‌సీ,ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు విమరి ్శంచారు. జెఎస్పీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

# మోడీ విశాఖ పర్యటన నిరాశ పరిచింది

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ,జూన్21,ప్రభాతవార్తప్రతినిధి:** యోగాంధ్ర పేరుతో విశాఖ వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి సంబంధించిన కీలకమైన సమస్యలతో సహా విశాఖ ఉక్కుపై ఒక్క మాట కూడా చెప్పకపోవడం రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ప్రధాని మోడీ తన ప్రసంగంలో విశాఖ నగరం ప్రకృతి, అభివృద్ధుల సంగమం అని పేర్కొన్నారు కానీ విశాఖ నగరాభివృద్ధి ఆనాటి పోర్టు నుండి స్టీల్‌ప్లాంట్ వరకు జరిగిన ప్రభుత్వ రంగ సంస్థల వృద్ధితోనే సాధ్యమైందన్న విషయం వాస్తవమని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మూడు నెలల వ్యవధిలో రెండుసార్లు విశాఖ సందర్శించిన ప్రధాని ఉక్కు విషయంలో దాటవేయడం దారుణమని ఆగ్రహించారు. ఆ సభలోనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చి స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించబోమని స్పష్టమైన ప్రకటన చేయిస్తారని నగర ప్రజలు, కార్మికులు ఆశించారని తెలిపారు. కానీ అలా జరగలేదన్నారు. గతంలో ఏ ప్రధానమంత్రి రాష్ట్రానికి వచ్చినా పర్యటించిన ప్రాంతాల ప్రజల సమస్యలు ప్రస్తావించి నిర్దిష్టమైన హామీలు ఇవ్వడం ఒక చారిత్రాత్మక వాస్తవమని పేర్కొన్నారు. మనిషి ఊబకాయం మొదలు ప్రపంచ దేశాల మధ్య ఉద్రిక్తతల నివారణకు సైతం యోగా పరిష్కారమన్న రీతిలో ప్రధానమంత్రి ప్రసంగం సాగిందని తెలిపారు. అమెరికా పనుపున ఇజ్రాయిల్ పెట్రేగిపోయి గాజాలో చిన్న పిల్లలను సైతం చంపడం, ఇరాన్‌పై మారణహోమం సాగిస్తుండడం వంటి అఘాయిత్యాలకు పాల్పడుతుంటే వాటిపై కిమ్మనకుండా ఇటువంటి హితబోధలు చేయడం దేశ ప్రజలను తప్పుదారి పట్టించేందుకే దోహదపడుతుందని మండిపడ్డారు.

తెలంగాణకు అన్యాయం చేయబోమని, తప్పనిసరిగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడతామని జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ స్పష్టం చేసినప్పటికి బనకచర్ల విషయంలో ఆంధ్రప్రదేశ్‌ను తట్టిలేపింది తెలంగాణ పాలకులే అనే విషయం మాత్రం మరవొద్దు. బనకచర్ల పాపం కెసిఆర్‌దే అని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపిస్తే, కాంగ్రెస్ తట్టిలేపిందని హరీష్‌రావు ఆరోపిస్తున్నారు. పరస్పర అవగాహనతో కాంగ్రెస్, బిఆర్ఎస్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శిస్తున్నారు. తెలంగాణలో 1.50 కోట్ల ఎకరాలకు నీరం దించేలా గోదావరిలో 1,000 టిఎంసిలు, కృష్ణాలో 500 టిఎంసిలు మొత్తం 1,500 టీఎంసీలు ఉపయోగించుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరభ్యంతర పత్రం ఇచ్చి, దానికి కేంద్రం కూడా ఆమోదం తెలిపితే, ఏపీ బనకచర్ల సహా ఏ ప్రాజెక్టులు నిర్మించుకున్నా తెలంగాణకు అభ్యంతరం లేదని కేంద్రమంత్రికి తెలంగాణ పాలకులు తెలిపారు. పోలవరం బనకచర్ల లింక్ ద్వారా కాకుండా ఇచ్చంపల్లి నాగార్జునసాగర్ అనుసంధానం ద్వారా పెన్నా పరీవాహక ప్రాంతానికి ఏపీ సర్కారు నీరు తీసుకెళ్లాలనుకుంటే దానిపై చర్చించడానికి మేం సిద్ధం అని తెలంగాణ పాలకులు జలశక్తి మంత్రి వద్ద తెలిపారు. త్వరలో ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తామని కేంద్రజలశక్తి మంత్రి హామి ఇచ్చారు. బిఆర్ఎస్ నీటివాటాలో తగ్గేదేలే అంటోంది. గోదావరిలో 1,950 టీఎంసీలు, కృష్ణాలోనూ 763 టీఎంసీలు వాటా కోరుతోంది. 'గోదావరిలో కావాల్సినంత నీరుంది ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలోకి పోతోంది. రెండు రాష్ట్రాలూ శక్తి మేర వాడుకోవచ్చు. ఎవరికీ నష్టం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎన్ని ప్రాజెక్టులు కట్టి ఉపయోగించుకున్నా మహా అయితే చెరో 200 టీఎంసీలే. మిగిలినదంతా సముద్రంలోకి పోయేదే కదా" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అంటున్నారు.

# బనకచర్ల దారిలో గోదా'వరీ'!

**భాగ్యనగర్ భాస్కర్ కుమార్**

'ఉప్పొంగే నదుల జీవజలాలు ఉప్పు సముద్రం పాలు' అంటూ1971లో పవిత్ర బంధం సినిమాలో గాంధీపుట్టిన దేశమా అనే పాటలో గీతరచయిత ఆరుద్ర ఆవేదన చెందారు. ప్రాజెక్టులు రాజకీయ పార్టీలకు ఎన్నికల ఆర్థికవనరులుగా ఉపయోగపడుతాయని మన నేతలకు జ్ఞానోదయమయ్యే వరకు 'నీరు' రాజకీయ వస్తువుగా మారడంతో ఇప్పుడు ప్రాజెక్టులు కట్టుకోని పరిస్థితి దాపురించింది. పోలవరం బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్యఅగ్గిరాజేసింది. తెలంగాణలో మూడు ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పోలవరం బనకచర్ల ప్రాజెక్టు చుట్టే తమ రాజకీయ విన్యాసాలు చేస్తూ ప్రజలను సమస్యల నుంచి పక్కదారి పట్టిస్తున్నారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ పోలవరం బనకచర్ల ప్రాజెక్టుపై అఖిల పక్ష సమావేశం నిర్వహించి తన ప్రత్యర్థులైన బిజెపిని, బిఆర్ఎస్‌ను ఇరుకునపెట్టే ప్రయత్నం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి జలాలు పెన్నాకు తరలించేందుకు ప్రతిపాదించిన ప్రాజెక్టు పాపం కెసిఆర్‌దే అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిందించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దొంగతనంగా పోయి కేంద్రజలశక్తి మంత్రిని కలిసాడని అఖిలపక్షం సమావేశానికి రాలేదని నిందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చంద్రబాబుకు దాసోహమై రాజీపడి పచ్చజెండా ఊపారని తెలంగాణలోని ప్రధాన ప్రతిపక్షంనాయకుడు తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. బిజెపి,కాంగ్రెస్ రెండు చంద్రబాబును కొమ్ముకాస్తు తెలంగాణ ప్రయోజనాలు పణంగా పెడుతున్నారని బిఆర్ఎస్ ఆపోస్తుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం పోలవరం బనకచర్ల ప్రాజెక్టు ప్రీఫీజుబిలిటి రిపోర్టును కేంద్ర ఆర్థిక అదనపు కార్యదర్శికి సజ్జన్‌యాదవ్‌కు, కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ జాయింట్ కమీషనర్ అమిత్‌కుమార్‌ఝాలకు తన ఉన్నత స్థాయి అధికారులతో అందజేయించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు కేంద్రజలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను కలిసి 1980గోదావరి ట్రిబ్యునల్ అవార్డును ఉల్లంఘించి ఎపెక్స్ కమిటీ అనుమతి లేకుండా కడుతున్న ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరారు. కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్‌పాటిల్ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం ఏర్పాటు చేస్తామని తెలంగాణ ప్రభుత్వాధినేతలకు హామి ఇచ్చింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు "బనకచర్లపై పోరాటం ఎందుకు?ప్రాజెక్టులు కట్టి నీరు తీసుకోండి.. ఎవరొద్దన్నారు? మేం కట్టుకోవద్దన్నామా? దీనిపై రెండు రాష్ట్రాల వారూ ఢిల్లీ పోతాం.. కూర్చుని మాట్లాడతాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'గోదావరిలో నీటిని



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకుంటున్నాయి. నాకు తెలిసినంతవరకు విభజన చట్టంలో ఉన్న పోలవరం తప్ప.. మిగిలినవన్నీ అనుమతి రాని ప్రాజెక్టులే. వాటికి చట్టబద్ధతపై కేంద్రంతో మాట్లాడుకుందాం" అంటూ రాజనీతిజ్ఞతను ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి సమయంలో తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల ప్రతిపాదన చంద్రబాబు ముందు పెట్టి ఉభయ కుశలోపరి అనుకుంటే సమస్యతీరుతుంది. జాతీయ నదుల అనుసంధానంలోనూ కీలక భూమిక వహించే పోలవరం బనకచర్ల అనుసంధాన పథకం రాయలసీమకు గేట్‌వే మాత్రేమ పరిమితం చేయకుండా ఉభయ తెలుగు రాష్ట్రాలకు వరప్రదాయినిగా ఉపయోగించుకొనే అవకాశం ఉంది. పోలవరం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంకు రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదిస్తున్నారు. కానీ అంతకంటే తక్కువ వ్యయంతో అంటే కేవలం రూ.25వేల కోట్లు ఖర్చుచేస్తేచాలు పోలవరం నుంచి శ్రీశైలంకు నీటిని తరలించడం ద్వారా కృష్ణాబేసిన్‌లోని ఉభయరాష్ట్రాల అవసరాలు తీర్చడమే కాకుండా పెన్నాబేసిన్, కావేరి బేసిన్‌లకు నీటిని తీసుకొని పోయేందుకు మార్గం సుగమం అవుతోంది. పోలవరం నుంచి శ్రీశైలంకు గోదావరి నీటిని రివర్స్‌పంపింగ్ ద్వారా ఎత్తిపోయడం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు మేలుజరుగుతుందని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం అధ్యక్షులు శ్యాంప్రసాద్‌రెడ్డి, కార్యదర్శులు వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం నుంచి గోదవరి వరద జలాలు రోజుకు 3నుంచి 4 టిఎంసిలు పులిచింతల, నాగార్జునసాగర్ టేయిల్‌పాండ్, ఎన్ఎస్‌పి జలా శయాలను ఉపయోగించుకొని శ్రీశైలం వరకు రివర్స్‌పంపింగ్ ద్వారా తరలించి ఉభయ తెలుగురాష్ట్రాల నీటి అవసరాలను తీర్చుకోవచ్చని వారు తెలిపారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం కర్ణాటక రాష్ట్రం అలమట్టి లాల్‌బహద్దూర్ డ్యామ్ 5మీటర్ల ఎఫ్ఆర్ఎల్ ఎత్తును పెంచుకోవడాని, 125 టిఎంసిలు అదనంగా నిల్వచేసుకోవడానికి అవకాశం ఇచ్చింది. ఆలమట్టి ఎత్తుపెంచితే 125 టిఎంసిల మేరకు కృష్ణానదిలో నీటి వరద తగ్గిపోయే ప్రమాదం ఉంది. జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు తగ్గే కృష్ణానది వరద జలాలను ప్రత్యామ్నయంగా గోదావరి జలాలు సప్లమెంటరీ ఫీడింగ్‌గా ఉపయోగించుకోవడానికి వీలవుతోందని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సూచనపై ఇరు రాష్ట్రాల పాలకులు సమాలోచనలు చేయాల్సి ఉంది. ఏలాంటి భూసేకరణ చేపట్టకుండా నాగార్జున సాగర్‌కు, శ్రీశైలం కు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని పేర్కొన్నారు. నాగర్జున సాగర్, శ్రీశైలంలో రివర్స్‌టర్బ్రన్స్ కూడా ఇప్పటికే ఉపయోగిస్తున్నారు. 2019 నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తో తెలంగాణ ముఖ్యమంత్రి ప్రగతి భవన్‌లో గోదావరి జలాలు ఉభయరాష్ట్రాలు శ్రీశైలం వరకు తీసుకొచ్చి అన్ని బేసిన్‌లకు వాడుకొందామని అనేక సమావేశాలలో చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ రెండు టిఎంసిలు పోలవరం నుంచి బనకచర్ల ద్వారా ఎత్తిపోసుకుంటామని రివర్స్‌పంపింగ్ ప్రతిపాదన కు సమ్మతి తెలుపకుండా తిరస్కరించారు. ప్రస్తుత సిఎం చంద్రబాబు కూడా అదే ప్రతిపాదనతో ముందుకుపోతున్నారు. ఈపథకాన్ని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏ ఎం)అంటే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించతలపెట్టారు. 3లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ, కొత్తగా 9.14 లక్షలహెక్టార్ల ఆయకట్టుకు సాగునీరు, 80లక్షల మందికి తాగునీరు, పారిశ్రామికావసరాలకు 20టీఎంసీలు, 200 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంగా నిర్ణయిం చారు. ఇందుకోసం రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100రోజుల పాటు 200 టీఎంసీల గోదావరి వరదజలాలను ఈప్రాజెక్టుకుతరలిస్తారు. పెన్నాబేసిన్‌కు నీటిని తరలించే బనకచర్ల పథకం మూడు దశల్లో చేపడుతారు. పోలవరం-బనకచర్ల మొదటి దశ కింద గోదావరి జలాలను పోలవరం డ్యాం నుంచి కుడిప్రధాన కాలువద్వారా ప్రకాశంబ్యారేజీకి మళ్లిస్తారు. బొల్లా పల్లి రిజర్వాయర్లోకి ఎత్తిపోయడంతో రెండో దశ మొదలవు తోంది. పోలవరంబనకచర్ల ప్రాజెక్టుకు వెన్నెముక బొల్లాపల్లి రిజర్వాయరు వ్యవహరిస్తుంది. దీని సామర్థ్యం 173టీఎంసీలు. రెండోదశలో ప్రకాశం బ్యారేజీ ఫోర్‌షోర్ నుంచి ఆరు దశల్లో ఈ రిజర్వాయరులోకి నీటిని ఎత్తిపోస్తారు. దీనికి మరో ప్రత్యామ్నాయం 1.2 కిలోమీటర్ల పొడవున టన్నెల్‌ను నిర్మించడం. మొదటి ప్రణాళికతోనే సాంకేతికంగా, ఆర్థికంగా లబ్ధి చేకూరుతుంది. దీని అమలుకు కేవలం 15 గ్రామాలకు సహాయ, పునరావాసం కల్పిస్తే సరిపోతుంది. పైగా జాతీయస్థాయిలో నిర్మించే రిజర్వాయర్లకు ఒక టీఎంసీకి సగటున రూ.100కోట్ల నుంచి 200కోట్లు వ్యయమవుతుంటే, బొల్లాపల్లి రిజర్వాయరుకు టీఎంసీకి సగటున రూ.30 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది. పైగా దీని ద్వారా 230 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తి కూడా జరుగుతుంది. ఈ రిజర్వాయరు నిర్మాణానికి రూ.35,760కోట్ల వ్యయమవుతుందని అంచనా. మూడు ఎత్తిపోతలతో మూడోదశ ఉంటుంది. మొత్తంగామూడు దశల్లో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.81,900 కోట్లు వ్యయమవుతాయి. తెలంగాణ విశ్రాంతఇంజినీర్లు ప్రతిపాదన కేవలం 25 వేలకోట్లతోనే పూర్తవుతోంది. ఉభయ రాష్ట్రాలలోని కోట్లాది మందికి తాగునీరు మూడుకోట్ల ఎకరాల సాగుభూమికి స్థిరీకరణ ఏర్పడే అవకాశం కూడాఉంది. ఎపిప్రభుత్వం ఈ దిశగా ఆలోచిస్తే తెలుగు రాష్ట్రాల మధ్యస్నేహబంధం పెరుగుతుంది. ●

# రెండా..మూడా?

మహారాష్ట్ర

**ఎ.వి.వి ప్రసాద్**

చదువుకొనే పిల్లలు ఏ భాషను నేర్చుకోవాలి? ఏ వయసులో నేర్చుకోవాలి?అనే ప్రశ్నలకు సమాధానాలు స్వాతంత్రం వచ్చిన ఏడున్నర దశాబ్దాలకు కూడా ఇంకా వివాదాస్పదం కావడమే ఆశ్చర్యం కలిగిస్తుంది. కేంద్ర ప్రభుత్వాలు ఇప్పటికి అనేకమార్లు విద్యావిధానాల్లో మార్పులు చేసినా వాటిలో ఏదీ సంతృప్తికరంగా అమలు గాకపోవడమే వాటిలోని లొసుగులను తేటతెల్లం చేస్తోంది. ఈ పరిస్థితిలో మహారాష్ట్ర ప్రభుత్వం తరచుగా విద్యావిధానంలో మార్పులు చేస్తూ ప్రజలను మరింత గందరగోళంలోకి నెట్టివేయడమేగాక, పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి ఫడ్నవిస్ గతవారం రాష్ట్ర విద్యావిధానంలో మార్పులుచేస్తూ జారీ చేసిన ఉత్తర్వులే అందుకు ఉదాహరణ. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు హిందీని తప్పనిసరి చేస్తూ ఫడ్నవిస్ ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకొన్నప్పటి నుంచి మహారాష్ట్రలో ఆందోళనలు మొదలయ్యాయి. మహారాష్ట్ర నవ నిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ ఠాకరే, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాకరే హిందీ నిర్బంధ అమలుకు వ్యతిరేకంగా పెద్దఎత్తునే ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వంలోని కూటమి పార్టీలలో దానిపై రాజకీయంగా చీలికలు వచ్చేట్లుగా కనిపించడంతో ఫడ్నవిస్ ఎట్టకేలకు దిగివచ్చి ప్రభుత్వ ఉత్తర్వులలోని 'తప్పనిసరి' అనే మాటను తొలగిస్తూ, మరికొన్ని నిబంధనలు చేర్చారు. దాని ప్రకారం విద్యార్థులు మూడో భాషగా హిందీకి బదులు మరో భారతీయ భాషనుఎంచుకోవచ్చు. అయితే ఆ భాషను నేర్చుకోవాలనుకొనే విద్యార్థులు తరగతిలో కనీసం 20 మంది ఉండాలట. అంతకు తక్కువ ఉంటే వారికి ఆన్‌లైన్‌లో ఆ భాషను బోధిస్తారట. లేకుంటే హిందీని నేర్చుకోవచ్చు. పైకి ఇది వినడానికి బాగానే ఉన్నట్లనిపించినా దానిలో చిన్న తిరకాసు కూడావినిపిస్తోంది. హిందీగాక మరో భాష నేర్చుకోవాలనుకునే వారు తరగతిలో కనీసం20మంది ఉండాలనడం సహేతుకమా?అని విపక్షాలే గాక తల్లిదండ్రులు కూడా ప్రశ్నిస్తున్నారు. అంటే హిందీని బలవంతంగా రుద్దడానికే ప్రభుత్వం ఈచర్య తీసుకొంటున్నదనుకోవచ్చు. నిర్బంధ హిందీని నేరుగా ప్రకటించకుండా ప్రభుత్వం దొడ్డిదారిన ఇలా హిందీ వాడకాన్ని ప్రోత్సహిస్తున్నదనీ, తద్వారా 'వన్ నేషన్ వన్ లాంగ్వేజ్' అనే ప్రతిపాదనకు బలం చేకూర్చినట్లవుతున్నదనీ విమర్శిస్తున్నారు. ఒక విధంగా ప్రభుత్వం ఆలోచన హిందీకి అనుకూలంగా ఉన్నట్లే భావించాలి. దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు, కర్ణాటక హిందీని పూర్తిగా వ్యతిరేకిస్తుండగా, ఎపి,తెలంగాణలో పాక్షికంగా అమలు చేస్తున్నారు. మాతృ భాషకు అదనంగా ఇంగ్లీషు



ఫడ్నవిస్

తప్పనిసరనీ మూడోభాషగా ఇష్టం వచ్చిన భారతీయ భాషను నేర్చుకోవచ్చునని కొత్త విద్యావిధానం (ఎన్ఇపి 2020)లో చెబుతున్నా ఆ మూడో భాషగా హిందీని అమలు చేయడానికే ఎన్డీయేపాలనలోని రాష్ట్రాలు ఆసక్తిని చూపుతున్నాయి. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్నచోట కూడా ముఖ్యంగా తమిళనాడులో ఎక్కువ వ్యతిరేకత కనిపిస్తోంది. మహారాష్ట్రలో త్రిభాషా విధానం అమలుచేస్తూ హిందీని మూడోభాషగా నిర్బంధం చేయడంతో పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దానితో నిబంధనల్లో మార్పు చేసినా కొత్త 'క్లాజ్' లు చేర్చడంతో ఇప్పుడు అది కూడా ఆందోళనలకు దారితీస్తోంది. గతవారం ఫడ్నవిస్ ప్రభుత్వం నిబంధనల సవరణ ప్రకటించగానే తల్లిదండ్రులు, రాజ్‌ఠాకరే భారీగానే నిరసనలు వ్యక్తంచేశారు. పైపెచ్చు ఒకటవ తరగతి నుంచి త్రిభాషా విధానం అమలు చేయాలని కూడా ఫడ్నవిస్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమిక స్థాయి నుంచి మూడో భాషచదవాలనే నిబంధన విధిం చడం దేశంలో ఒక్క మహారాష్ట్రలోనే కనిపిస్తోంది. మిగిలిన రాష్ట్రాల్లో కొన్నిచోట్ల 5వ తరగతి నుంచి, కొన్నిచోట్ల ఏడు, ఎనిమిది తరగతుల నుంచి అమలు చేస్తున్నారు. ఐదవ తరగతి దాటితే విద్యార్థులకు అర్థం చేసుకునే పరిస్థితి వస్తుంది గనుక అక్కడినుంచి వారికి మూడో భాషను నేర్పినా ఫలితం ఉంటుంది. మాతృ భాషతో పాటు ఇంగ్లీషు నేర్చుకోవడమే ప్రాథమిక స్థాయిలో కష్టమనీ, మూడోభాషను కూడా నేర్చుకోవాలనడం విద్యార్థులను తీవ్రఒత్తిడికి గురి చేస్తుందనీ దానివల్ల మరిన్నిఅనర్థాలు సంభవిస్తాయనీ తల్లిదండ్రులు, నిపుణులు అంటున్నారు. ప్రాథమిక స్థాయి నుంచే మూడో భాషగా హిందీని రుద్దితే విద్యార్థులు స్థానిక మరాఠా సంస్కృతికి, భాషకు దూరమవుతారనీ, దానివల్ల రాష్ట్ర భవిష్యత్తు అంధకారం లోకి వెళ్తుందనీ అంటున్నారు. ఈ అభిప్రాయం సమర్థనీయమే అనిచెప్పాలి. మాతృ భాష, మాతృసంస్కృతికి విఘాతం కలిగించే ఏ విషయమైనా వ్యతిరేకించవలసిందే. లేకుంటే దీర్ఘకాలంలో సమాజం చాలా నష్టాలను చవిచూడవలసి వస్తుంది. శివసేన, ఎంఎన్ఎస్ వంటిపార్టీలు మరాఠా పరిరక్షణకు మద్దతు పలుకుతూ ఆందోళన కార్యక్రమాలు ప్రకటించడంతో, తరువాత ఎప్పుడైనా ప్రభుత్వం పునరాలోచన చేస్తేఈలోగా కాలయాపన జరిగి విద్యార్థులు మరిన్ని సమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది. సంబంధిత పాఠ్యపుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో ఏభాష తీసుకోవాలో తెలియక అయోమయంలో పడుతున్న విద్యార్థులు కూడా ఉన్నారు. ముఖ్యంగా ప్రాథమిక స్థాయి నుంచి మూడోభాషను నేర్చుకోవాలనే విధానాన్ని మార్చుకొనకపోతే బాలలభవి ష్యత్తు చిక్కుల్లో పడుతుందనే చెప్పాలి. కొన్ని తరగతుల తర్వాత మళ్లీమూడో భాషను మార్చుకోవలసి వస్తే వారు ఏ భాషను సంతృప్తికరంగా నేర్చుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. విద్యాసంవత్సరం ఇప్పుడే మొదలైంది కనుక ఎక్కువ కాల యాపన చేయకుండా ఫడ్నవిస్ ప్రభుత్వం సరైన నిర్ణయంతీసుకోవడం అవసరం. త్రిభాషా విధానం అనుసరించినా దానిని ప్రాథమిక స్థాయి నుంచి అమలు చేయకపోవడమే మంచిది. కనీసం ఐదారు తరగతుల దాకా ద్విభాష తోనే సరిపెడితే విద్యార్థుల్లో వికాసం సంతృప్తికరంగా సాగుతుంది. ●

# షినవత్రకు 'అంకుల్' సెగలు!

థాయిలాండ్

**గన్ని మోహన్**

ఆగ్నేయాసియాలోని ఒక చిన్న దేశంలో పిన్నవయసులోనే అత్యున్నత పదవిని అధిష్టించిన థాయిలాండ్ ప్రధానమంత్రిని ఇప్పుడు పదవీగండం చుట్టుముడుతోంది. అదికూడా ఒక చిన్న ఫోన్‌కాల్ కావడం,పొరుగుననే అంతంతమాత్రం సంబంధాలున్న దేశ మాజీ ప్రధానితో జరిపిన సంభాషణలు లీక్‌కావడం మొత్తం అంతర్గత ముసలానికి దారితీసింది. థాయిలాండ్‌లో అనువంశిక పాలనగా వస్తున్న ప్రస్తుత పిన్నవయసు 38ఏళ్ల ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్ర పదవీసంక్షోభం ఎదుర్కొంటున్నారు. పొరుగుననే ఉన్న కాంబోడియా దేశ మాజీప్రధాని హున్‌సేన్‌తో జరిపిన సంభాషణలు లీక్ అయ్యాయి. ఇవి ఎవరు లీక్‌చేసారు. ఏ లక్ష్యంతో చేసారనేది పక్కనపెడితే ఈఫోన్‌సంభాషణలో షినవత్ర తనదేశ ఆర్మీ కమాండర్ తనకు ప్రత్యర్థిగా మారుతున్నాడని ఆవలి వ్యక్తితో చెప్పిన మాటలు థాయి ప్రజల్లోనే అసహనం పెంచుతున్నాయి. తన తండ్రి సమకాలికుడు అయిన హున్‌సేన్‌ను 'అంకుల్' అని ఎంతోప్రేమగా పిలిచిన షినవత్రకు ఇప్పుడు ఈమాజీప్రధాని పదవీ గండం తెచ్చిపెట్టాడు. నిజానికి పొరుగుననేఉన్న కంబోడియాతో థాయిలాండ్‌కు సంబంధాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. 2023 వరకూ అక్కడ ప్రధానిగా ఉన్న హున్‌సేన్ తర్వాత తన కుమారుడు హున్ మానెట్‌కు బాధ్యతలు అప్పగించారు. పదవిలో లేకపోయినా కంబోడియా రాజకీయాలను ఇప్పటికీ హున్‌సేన్ ప్రభావితం చేయగలడు. ఆయనతోనే ఇప్పుడు థాయ్‌ప్రధాని షినవత్ర చేసిన ఫోన్‌సంభాషణ లీక్ అయిఆమెకు పదవీగండం తెచ్చిపెట్టింది. పైగా ఈఫోన్‌సంభాషణ తానే రికార్డు చేసానని, 17నిమిషాలకాల్‌ను ఫేస్‌బుక్‌లో పోస్టుచేసి మరీ చెప్పిన కంబోడియా మాజీప్రధాని పారదర్శకత కోసమే ఇలాచేసినట్లు ఎలాంటి పొరపొచ్చాలు ఉండకూడదన్న భావనతోనే పోస్టుచేసానని చెప్పడం, ఆపై ఈసంభాషణలన్నీ కూడా సుమారు 80 మందితో పంచుకున్నట్లు కూడా వెల్లడించడంతో థాయిప్రజల ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి. సరిహద్దు వివాదాలతో సతమతం అవుతూ ఒక సైనికుడి మరణానికి కారణం అయినప్పటినుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. సరిహద్దులు మూసివేసారు. ఇప్పుడు తన సంభాషణల్లో సరిహద్దుల ఆంక్షలు తొలగింపు కూడా ప్రస్తావనకు వచ్చింది. అయితే ఆర్మీ కమాండర్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. థాయిలాండ్ రాజరిక రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు సైన్యం దేశ భద్రత, రక్షణకు కట్టుబడి పనిచేస్తుందని, థాయిలాండ్ ప్రజల సంక్షేమంకోసం పనిచేస్తుందని ప్రకటించారు. అంతేకాకుండా షినవత్ర వ్యాఖ్యలు కూడా తీవ్రంగా తప్పుపట్టారు. దేశ సైన్యాధ్యక్షుడిని 'ప్రత్యర్థి' అని సంబోధించడంపై ప్రభుత్వంలోకూడా నిరసనలు మిన్నంటాయి. వాస్తవానికి సంకీర్ణ కూటమి ప్రభుత్వాన్ని షినవత్ర నడుపుతున్నారు. ప్రధాన పార్టీఅయిన భూమ్ జై థాయ్‌పార్టీ కూటమినుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. దీనితో పార్ల



షినవత్ర

మెంటులో షినవత్ర మైనార్టీలో పడిపోయారు. ఇదే అదనుగా ప్రతిపక్షాలు వెంటనే పదవినుంచి దిగిపోవాలని, లేదా రాజీనామాచేసి, మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని పట్టుబడుతున్నారు. పార్లమెంటు భవనం ముందు ప్లకార్డులు, థాయి జెండాలను చేతబూని నిరసన ప్రదర్శనలకు సైతం దిగారు. ఈ యువ ప్రధానికి ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించుకోవడంతోపాటు పదవిని కాపాడుకోవడం, ప్రభుత్వాన్ని పూర్తికాలం కొనసాగించడం ఏకైక లక్ష్యంగా మారింది. మైనార్టీనుంచి గట్టెక్కడం అంటే షినవత్రకు కత్తిమీద సాములాంటిదే. మరోపక్క దేశ ప్రజల్లో మళ్లీ సైనిక తిరుగుబాటు వచ్చి మిలిటరీ రాజ్యం వస్తుందేమోనన్న భయాందోళనలు పెరిగాయి. వాస్తవానికి షినవత్ర తండ్రి థక్సిన్ షినవత్రను 2006లో తిరుగుబాటుతో దించేసారు. అలాగే తర్వాత వచ్చిన థక్సిన్ సోదరి యింగ్లక్ షినవత్రా 2011లోప్రధాని బాధ్యతలు స్వీకరిస్తే ఆమెను కూడా 2014లో సైన్యం తిరుగుబాటుతో ప్రభుత్వాన్ని కూల్చివేసింది. ఇప్పుడు మళ్లీ ఆ పరిస్థితి వస్తుందన్న భయాలు థాయ్‌ప్రజల్లో పెరిగిపోతున్నాయి. ప్రధాన పార్టీ భూమ్‌జాయ్‌తే వైదొలగడంతో పదిపార్టీల సంకీర్ణ ప్రభుత్వం 255 సీట్లతో ఉంది. 500సీట్లసభలో మెజార్టీ కంటే స్వల్పంగా మాత్రమే ఎక్కువ ఉంది. పీపుల్స్ పార్టీనేత నత్తఫాంగ్ రుయెంగ్‌పన్యావుట్ అయితే ఏకంగా పార్లమెంటును రద్దుచేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌చేసారు. లీక్ అయిన ఫోన్‌కాల్ ఆమె పరిపాలన తీరును తేటతెల్లంచేస్తోందని, థాయ్ రహస్యాలను పొరుగు దేశానికి చేరవేసారని ఆరోపించారు. షినవత్రా తండ్రి హయాంనుంచి కూడా కంబోడియాతో మంచి సంబంధాలే ఉన్నాయి. థక్సిన్‌తో కంబోడియా ప్రధాని హున్‌సేన్ సుదీర్ఘమైత్రిని కొనసాగించారు. వీరిద్దరినీ కూడా రెండుదేశాలప్రజలు 'గాడ్ బ్రదర్స్' అని చెప్పుకుంటారు. ఒకదశలో థక్సిన్‌ను కంబోడియా ప్రభుత్వ సలహాదారుగా కూడా నియమించారు. అయితే థక్సిన్ కొద్దిరోజులకే ఆ పదవికి రాజీనామాచేసారు. ఇక ప్రస్తుత సంక్షోభం నుంచి బయటపడేందుకు కాంబోడియా రాయబారికి థాయ్ విదేశాంగశాఖ నిరసన తెలుపుతూ లేఖను పంపించింది. మీ దేశ చర్యలు ఆమోదయోగ్యంకాదని, దౌత్య మర్యాదలు ఉల్లంఘించారని, మీపై పొరుగుదేశానికి ఉన్న విశ్వాసాన్ని వమ్ముచేయడమేనని చెపుతూ ఇరు దేశాల మైత్రీశైలిని దెబ్బతీస్తుందని హెచ్చరించింది. ప్రతిపక్షాల పార్లమెంటు రద్దుడిమాండ్ సానుకూలం కాకపోతే షినవత్రపై అభిశంసన తీర్మానం కూడా ప్రవేశపెడతామని హెచ్చరించాయి. కొన్ని పార్టీలు, ప్రజాసంఘాలయితే దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదులు కూడాచేసారు. ఏది ఎలా ఉన్నా తన కుటుంబంలోని పెద్దల సహకారంతో మళ్లీ ఆమె ఈ గండం నుంచి బయటపడతారా అన్నది సందేహమే. ఎందుకంటే ఎప్పటినుంచో తిరుగుబాటుకోసం సైన్యం కాచుకుని ఉన్న తరుణంలో ఈ యువప్రధాని ఎలాసవాళ్లను అధిగమిస్తారనేది ప్రజలకు అంతుబట్టకుండాఉంది. ●

# అక్రమ లైంగిక సంబంధాలే అమానవీయ హత్యలకు కారణమా?



డాక్టర్ నీలం సంపత్

డబుల్ ఇంజన్ సర్కార్ కొలువు తీరిన మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజా రఘు వంశీ ఎగువ మధ్య తరగతి వ్యాపార కుటుంబానికి చెందిన ఓ అందమైన యువకుడు. ఓ నెల రోజుల క్రితమే తోటి వ్యాపార కుటుంబానికే చెందిన అందమైన యువతి సోనమ్‌తో పెద్దలు కుదిర్చిన వివాహం. జంటను ఏకంచేస్తూ అంగరంగ వైభవంగా పూర్తయిన వివాహ వేడుక తదనంతరం ఆధునిక నాగరికతలో భాగంగా నూతన వధూవరుల హనీమూన్ ట్రిప్ ఖరారు. టూరిస్ట్ ప్రదేశాలకు నెలవైన మేఘాలయలో నూతన దాంపత్య జీవితాన్ని ప్రారంభించాలని హనీమూన్‌కు వెళ్లడం జరిగింది. ఐతే తామొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు రాజా రఘువంశీ ప్రమాదవశాత్తూ లోయలో పడి మరణించినాడనే వార్త ఆయనకు తోడుగా వున్న నవ వధువైన సోనమ్ గుండెలవిసేలా చేసిన రోదన ద్వారా రెండు కుటుంబాల సభ్యులకు చేరడం వారిని దుఃఖ సాగరంలో ముంచివేయడం గమనార్హం. ఆ ఘోర దుర్ఘటనపై పోలీసులు చేసిన పరిశోధనలో రాజా రఘు వంశీది ప్రమాద వశాత్తూ జరిగిన మరణం కాదు. తన చీకటి స్నేహితుడైన రాజ్ కుష్వాహ తోడ్పాటుతో హైర్ డ్ కిల్లర్స్ చేత నవ వధువైన సోనమ్ చేయించిన అత్యంత కిరాతకమైన హత్య అని పోలీసులు చేసిన అభియోగం. ఆ కుటుంబ సభ్యులతో పాటు దేశ ప్రజలను నిశ్చేష్టులను చేసింది. సోనమ్‌తో పాటు, ఆమె బాయ్ ఫ్రెండ్ నీ, హత్యలో పాలుపంచుకున్నట్లు అనుమానిస్తున్న నిందితులను ఆయుధాలతోసహా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్న నేపథ్యంలో హనీమూన్‌లో భాగంగా ఆ నవ దంపతులు చేస్తున్న పర్యటనలో అస్సాం లోని గౌహతిలో మొదటిసారి, మేఘాలయలో మరోసారి హత్యకు ప్రయత్నించి విఫలమై చివరకు మూడోసారి రఘు వంశీని హత్య చేయించి దానిని ప్రమాదంగా చిత్రీకరించిందని పోలీసుల కథనం. అదే నిజమైతే హనీమూన్ పర్యటనలో తన భర్తయైన రఘు వంశీని ఎలాంటి అనుమానం రాకుండ ఎలా నమ్మించగలిగిందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నేగదా? క్రైమ్ థిల్లర్‌ని మరిపించే ఈ అమానవీయ హత్యారోపణలో ఆమె నటనకు ఆస్కార్ అవార్డు కూడా దిగదుడుపేనని చెప్పక తప్పదు. ఈ తరహా నేర ఉదంతాలలో ఇది మొదటిదీ కాదు, చివరిదీ కాకపోవచ్చు! ఆధునిక సమాజంలో గత ఆరేడు సంవత్సరాల కాలం నుండి ఈ తరహా ఘోర నేరాలు పెచ్చుమీరుతున్న వైనంతో ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైనదీ, పటిష్టమైనదిగా భావించే భారతీయ వివాహ వ్యవస్థ కఠిన పరీక్షను ఎదుర్కొంటున్నదనే కఠోర సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. స్త్రీ, పురుషుల మధ్యఅనైతిక, వివాహేతర సంబంధాల నేపథ్యంలో జీవిత భాగస్వాముల లోనే ఒకరు మరొకరిని అత్యంత కిరాతకంగా హత్య చేయిస్తున్నారనే ఆరోపణలతో పెళ్లంటేనే యువత గజగజలాడే పరిస్థితి వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇష్టం లేకపోతే లేదా వైవాహిక బంధాన్ని కొనసాగించడం కష్టమైతే విడాకులు తీసుకోవచ్చు. అంతేకాని హత్య చేయడమేమిటి? ఐతే ఇలాంటి హేయమైన హత్యలకు కారణాలను శోధించినప్పుడు కేవలం తమ తీవ్రమైన లైంగిక వాంఛలను తృప్తి పరచుకోవడానికే నేరస్తులు ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నారు అనుకోవడం సబబు కాదేమోననిపిస్తుంది. ఎందుకంటే కొన్ని సందర్భాల్లో ఆర్థిక ప్రయోజనాల కోసం, ఆస్తి కోసం, ప్రభుత్వ ఉద్యోగాల ఆశతో పాటు వేధింపుల నుండి విముక్తి కోసం కూడా ఈ తరహా హత్యల పరంపర కొనసాగుతోంది. మొన్నటికి మొన్న ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో సౌరవ్ రాజ్‌పుత్ అనే నేవీ అధికారిని ఆయన భార్య ముస్కాన్ ఆమె ప్రియుడు సాహిల్‌తో కలిసి అత్యంత కిరాతకంగా హత్యచేసి ఆయన డెడ్ బాడీని ముక్కలు ముక్కలుగా నరికి డ్రమ్ములో పెట్టి సీల్ చేసిందనే పోలీసుల అభియోగం, మరో హేయమైన ఘటనలో హైదరాబాద్‌కి చెందిన వ్యాపారి రమేశ్‌ను అతని భార్య నీహారిక తన భర్త ద్వారా పరిచయమైన వ్యక్తితో వివాహేతర సంబంధానికి



అలవాటై భర్తని కడతేరిస్తే వచ్చే ఆస్తితో ప్రియుడితో ఆనందంగా జీవించవచ్చు అనే భావనతో ప్రియుడితో కలిసి భర్తను కారులో భువనగిరి తీసుకెళ్లి అక్కడే హత్యచేసి శవాన్ని ఊటీకి తీసుకెళ్లి అక్కడ కాఫీతోటలో దహనం చేసిందనే అభియోగంతో పోలీసుల దర్యాప్తు. మరో ఘటనలో వరంగల్ జిల్లా భట్‌పల్లికి చెందిన సుమంత్ రెడ్డి తన భార్య ఫ్లోరా ఫిట్‌గా వుండాలనే భావనతో శారీరక వ్యాయామం కోసం జిమ్‌లో చేర్పిస్తే ఫిట్‌నెస్ ట్రైనర్ శామ్యూల్‌తో వివాహేతర సంబంధాన్ని నెరపుతూ ఆయన తోడ్పాటుతో భర్తని హత్య చేయించిందనే ప్రాసిక్యూషన్ ఆరోపణ, విభ్రాంతిని కలిగించింది. మరో ఘటనలో రజిత అనే ముగ్గురు బిడ్డల తల్లి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలిసిన తన పాత ప్రేమికుడు శివకుమార్‌తో పెంచుకున్న అక్రమ సంబంధంతో వారి ప్రేమకు అడ్డుతగులుతారనే భయంతో భర్త, ముగ్గురు పిల్లలపై విషప్రయోగం చేసింది. అందులో అమాయకులైన ముగ్గురు పిల్లలు చనిపోగా భర్త తృటిలో ప్రాణాపాయం నుండి బయటపడ్డారంటూ పోలీసుశాఖ కేసు నమోదు. కామారెడ్డి మాచా రెడ్డిలో రేణుక అనే వివాహిత పూజారి మహేష్‌తో అక్రమ లైంగిక సంబంధాన్ని శాశ్వతం చేసుకోవడంతోపాటు తన భర్త మున్సిపల్ ఉద్యోగాన్ని డిపెండెంట్‌గా కారుణ్య నియామకంలో పొందవచ్చనే దుర్మార్గపు ఆలోచనతో పదిహేను లక్షల రూపాయలసుపారీ ఇచ్చి తన భర్తను హత్య చేయించిందనే అభియోగాలతో కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు. తనతో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్న ఓ పూజారిని వివాహిత తనను పెళ్ళి చేసుకోమని కోరినందుకు ఆయన ఆమెను హత్య చేసి పొక్లెయిన్ సహాయంతో పాతిపెట్టిందనే అభియోగాలతో పోలీసులు నమోదు చేసిన కేసులు సభ్య సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసేవే. ఇలా ఒకటా రెండా రాష్ట్రంలో దేశంలో ఎక్కడచూసినా వివాహేతర లైంగిక సంబంధాలే క్రూరమైన హత్యలకు ఊపిరులూదుతున్నాయనే ప్రాసిక్యూషన్ కథనాలు సభ్య సమాజానికి గుండెలవిసేలా చేస్తున్నాయని చెప్పకతప్పదు. వందల,వేల సంవత్సరాలుగా ప్రపంచ వివాహ వ్యవస్థకే తలమానికంగా కొనసాగుతున్న భారతీయ వివాహ వ్యవస్థ దాంపత్య జీవనానికి పరిపూర్ణతను ప్రసాదిస్తూ భార్యాభర్తల మధ్య శాశ్వత శారీరక సంబంధంతోపాటు ఓ అనిర్వచనీయమైన మానసిక భావోద్వేగబంధాన్నిసృష్టిస్తూ ఒకరు మరొకరి ప్రాణాలను తీయడం కాదు. ఒకరుమరొకరి కోసం తమ ప్రాణాలను త్యాగంచేసేలా ప్రోత్సహిస్తూభారత దేశంలో వివాహానికి ఎక్స్‌పైరీ డేట్ లేదనే సత్యాన్నిఋజువు చేస్తూ మరణం తర్వాత కూడా వారి బంధాన్ని సజీవంగా కొనసాగిస్తున్న వైనం ఇక మరిచి పోవాల్సిన గతంగా మారనుందేమోననే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది. ఇంటర్ నెట్‌లో నియంత్రించలేక పోతున్న అశ్లీల వీడియోలు, వెబ్‌సిరీస్, నెట్ ఫ్లిక్స్, ఓ.టి.టి వేదికల ద్వారా ప్రసారమోతున్న క్రైమ్ సీరియల్స్, అశ్లీలతను పెంచిపోషిస్తున్న కొన్ని రియాలిటీ షోలు, పబ్‌లూ, బార్లలో మద్యాన్ని దాటి మత్తు పదార్థాల పంపిణీ తోడ్పాటుతో పెట్రేగిపోతున్న అశ్లీల నృత్యాలు, విశృంఖల జీవన శైలి మనుషులలో జంతు ప్రవృత్తిని పెంచి పోషిస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు సమాజంలో పెచ్చుమీరుతున్న పాశ్చాత్య నాగరికత ఉధృతి పవిత్రమైన భారతీయ వివాహ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా పోటీపడుతున్న కట్టుబాట్లకందని సహజీవన సంస్కృతితో పాటు హోమో కల్చర్‌వైపు కొంత మంది మొగ్గుచూపుతుండడం, వాటితో పాటు వివాహేతర సంబంధాలు సైతం అనైతికమైనవే తప్ప చట్టం దృష్టిలో శిక్షార్హమైన నేరాలు కావంటున్న ఉన్నత న్యాయస్థానాల వైఖరిలాంటి విపరీత ధోరణులు మనుషులలో భయాన్ని తగ్గించి వారిలో పశు ప్రవృత్తిని ప్రేరేపిస్తున్నాయేమోనని మనోవిజ్ఞానవేత్తల నిశ్చితాభిప్రాయం. ఈ సంక్లిష్టమైన సామాజిక సమస్యపై సామాజిక వేత్తలు లోతైన అధ్యయనంతో సరైన పరిష్కారాన్ని చూపెట్టాల్సిన అవసరమెంతైనా వుంది. సమాజ గతిని మారుస్తూ ఓ ఆదర్శ సమాజ సృష్టికి చుక్కానిగా వ్యవహరించే పత్రికలూ ప్రసార సాధనాలు సైతం కుటుంబవ్యవస్థకు వెన్నెముకలాంటి భార్యాభర్తల బంధంపాలిట క్యాన్సర్‌గా పరిణమిస్తున్న వివాహేతర లైంగికసంబంధాల హత్యలపై నిపుణులతో విశ్లేషణాత్మక వ్యాసాలతో, టి.విల్లో చర్చాగోష్టులను నిర్వహిస్తూ ఈతరహా అనాగరిక, అమానవీయ హత్యాకాండను నివారించాల్సిన బాధ్యతను నిర్వర్తించేవిధంగా ప్రభుత్వాలను ప్రోత్సహిస్తూ, పౌరసమాజంలో స్ఫూర్తినిరగిలించాలి. ●

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

## అంతర్జాతీయ యోగా దినోత్సవం

**తాడిపత్రిటౌన్, జూన్ 21 ప్రభాతవార్త**



యోగా నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రి పట్టణ శివారులోని ఆటోనగర్ సమీపంలో వున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మే 21 నుండి జూన్ 21 వరకు కళాశాలలో యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన ర్యాలీలు, యోగా ప్రాముఖ్యతపై సెమినార్, సామూహిక యోగా సెషన్ తదితర యోగాకు సంబంధించి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడమే కాకుండా, ఇది శ్రేయస్సు వైపు సార్వత్రిక ప్రయాణాన్ని కూడా సూచిస్తుందన్నారు. ఇది మెరుగైన ఆరోగ్యం, మానసిక స్పష్టత మరియు ఆధ్యాత్మిక సమతుల్యత వైపు ఒక వ్యక్తిగత ప్రయాణమన్నారు. యోగా అనేది కేవలం ఒక వ్యాయామం మాత్రమే కాదని ఇది మొత్తం శ్రేయస్సును మెరుగుపరచడానికి ఒక సమగ్ర వ్యవస్తన్నారు. 5 వేల సంవత్సరాల క్రితం ప్రాచీన భారతదేశంలో ఉద్భవించిన యోగా, ఆరోగ్యం యొక్క శారీరక, మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక కోణాలను సంబోధిస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అన్నపూర్ణ, జయలక్ష్మి, సత్యనారాయణ, డాక్టర్ విశ్వాసరావు, డాక్టర్ విజయభాస్కర్, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం




యోగా చేస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, జూన్ 21 ప్రభాతవార్త**

11వ అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమాన్ని తాడిపత్రి పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా షిలోహు ప్రార్థన మందిరం, నందలపాడు ప్రగతి హైస్కూల్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మున్సిపల్ కమీషనర్ రాంప్రసాద్‌రెడ్డి, 33వ వార్డు కౌన్సిలర్ విజయ్‌కుమార్, 34వ వార్డు ఇన్‌చార్జ్ పావురాల శీనయ్య, ప్రగతి స్కూల్ ప్రిన్సిపాల్ వలి. స్టోర్ డీలర్ పుల్లయ్య. 271 బూత్ కన్వీనర్లు సూరి, రాజేష్. సచివాలయం సిబ్బంది, విద్యార్థులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన కౌన్సిలర్



టిబి పేషెంట్లకు కిట్లను అందచేస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, జూన్ 21 ప్రభాతవార్త**

టిబి వ్యాధితో బాధపడుతున్న 20 మంది టిబి పేషెంట్లకు తాడిపత్రి పట్టణంలోని టైలర్స్ కాలనీలో వున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌లో శనివారం 21వ వార్డు కౌన్సిలర్ టింకర్ హుస్సేన్‌బాష నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ఎవరు అధైర్య పడకుండా ధైర్యంగా వుండాలని మంచి పౌష్టికాహారం తీసుకుంటే రోగాన్ని జయించే సత్తా మీకు వస్తుందన్నారు. దాదాపు 800 రూపాయలు విలువచేసే నిత్యావసర సరుకులను టిబి రోగులకు పంపిణీ చేశారు. ఆరు నెలల పాటు తన సొంత డబ్బులతో టిబి పేషెంట్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తానని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ తేజస్విని, టిబి సూపర్ వైజర్ సునీల్‌కుమార్, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



యోగా చేస్తున్న దృశ్యం

**యల్లనూరు, జూన్ 21 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఎంపిడిఓ కరుణసాగర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శి సలీం, హెల్త్ సిబ్బంది, సిహెచ్ఓ మధుకుమార్, సూపర్‌వైజర్ హాజీవలి, ఎఎన్ఎం శ్రీదేవి, హెచ్ఎం రత్నమ్మ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ప్రశాంతతను పొందవచ్చన్నారు. అలాగే యోగా ప్రాధాన్యతను తెలియచేశారు. అదేవిధంగా తిమ్మంపల్లి పాఠశాలలో ఎంఇఓ 2 పరమేశ్వర్‌రెడ్డి పాల్గొని పిల్లలచే యోగా కార్యక్రమాలు చేయించారు. మండలంలోని ప్రతి పాఠశాలలో కూడా యోగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

## చిన్నంపల్లిలో యోగాంధ్రా కార్యక్రమం

- అధికారులు,టిడిపి నాయకులు.



విద్యార్థులతో కలిసి యోగ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, జూన్ 21 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం చిన్నంపల్లి పంచాయతీ లోని వివిధ పాఠశాలలో, కార్యాలయం ఏపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే పరిటాల సునీత,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించిన అధికారులు, టిడిపి నాయకులు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉన్న ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన ఉద్దేశంతోనే కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు యోగా కార్యక్రమాన్ని నెల రోజులపాటు నిర్వహించి ప్రజలందరికీ నిత్యం జీవితంలో యోగ ఒక భాగం చేయాలన్నారు. అందరూ యోగాన్ని సాధన చేయాలని యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివశంకర్, పంచాయతీ కార్యదర్శి చరణ్ కుమార్,టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపుకు వెళ్లి

## మట్టిలో కలిసిపోయాడు..!

**- విద్యుదఘదానికి గురై డ్రైవర్ మృతి - పెద్దదిక్కును కోల్పోయిన భార్య, కూతురు**



టిప్పర్ పక్కనే విగతజీవిగా పడిపోయిన ◄ లోకేష్

ప్రాణాలు కోల్పోయిన లోకేష్ ►



**యాడికి(తాడిపత్రి), జూన్21, ప్రభాతవార్త**

జీవనం కోసం టిప్పరు డ్రైవర్‌గా వెళ్లిన లోకేష్ రాయలచెరువులోని మట్టిని తన యజమాని తోటలోకి తరలిస్తూ విద్యుదఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని రాయలచెరువులో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలు..రాయలచెరువుకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు లోకేష్(27) మదమంచి శివ అనే లారీ యజమాని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం రాయలచెరువు చెరువులో నుంచి మట్టిలోడుతో తన యజమాని మదమంచి శివకు చెందిన తోటలోకి వచ్చిన లోకేష్ అన్‌లోడు చేసి టిప్పర్‌ను ముందుకు కదిలించాడు. టిప్పరు ట్రాలీ కిందికి దిగనందున పైన ఉన్న విద్యుత్తు తీగలు ట్రాలీకి తగిలి ముందుకు కదలలేదు. ఎందుకు కదలలేదనే అనుమానంతో కిందికి దిగబోతూ హ్యాండిల్స్ పట్టుకొని కిందికి దిగగానే కాళ్లు భూమిని తాకడంతో విద్యుదఘదానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. మృతుడు లోకేష్‌కు భార్య, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న మృతుని భార్య, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని విగత జీవిగా మారిన లోకేష్‌ను చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటరమణయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై వెంకటరమణయ్య తెలిపారు.

**తండ్రి, తమ్ముడితో పాటు అర్ధాంతర చావు..!**

శనివారం విద్యుదఘాతానికి గురై మృతి చెందిన లోకేష్ తండ్రి సుబ్రహ్మణ్యం గతంలో ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడటం, తమ్ముడు అశోక్ పురుగుల మందుతాగి తనువు చాలించడం గమనార్హం. వారిలాగే కాకపోయినా ప్రమాదంలో లోకేష్ కూడా అర్ధాంతర చావుకు గురవడం కుటుంబ సభ్యులను, బంధువులను కలచివేసింది. లోకేష్ మృతితో అతని భార్య, నాలుగేళ్ల కూతురు దిక్కులేనివారయ్యారు.

## జెకెపల్లి వద్ద బొలెరో వాహనం బోల్తా

-ఒకరు మృతి - 7 మందికి గాయాలు





మృతి చెందిన మహిళ

◄ బోల్తా పడిన బొలెరో వాహనం

**ముదిగుబ్బ, జూన్ 21 ప్రభాతవార్త**

మండలంలోని జెకెపల్లి – రాళ్ల అనంతపురం మధ్య జాతీయ రహదారిపై శనివారం బొలెరో వాహనం బోల్తాపడిన సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో 7 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ముదిగుబ్బ పోలీసులు వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా వున్నాయి. కృష్ణాపురంకు చెందిన వారు చర్చి స్కూల్ ప్రచారానికి వెళ్లి బొలెరో వాహనంలో తిరిగి కృష్ణాపురం వెళుతుండగా బొలెరో వాహనం టైరు పేలడంతో వాహనం బోల్తాపడింది. ఈ సంఘటనలో బొలెరోలో వున్న అరుణాదేవి (42) మృతి చెందగా మరో 7 మందికి తీవ్రగాయాలయ్యాయి.

## కదం తొక్కిన సచివాలయ ఉద్యోగులు

**- సమస్యలు పరిష్కరించిన తర్వాతే బదిలీల ప్రక్రియ కొనసాగించాలి**

**- సచివాలయ ఉద్యోగుల సంఘం నేతలు డిమాండ్**

**అనంతపురం జూన్ 21 ప్రభాతవార్త**



ధర్నా నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించిన తర్వాతనే బదిలీల ప్రక్రయకు చర్యలు ం చేపట్టాలని వందలాది మంది ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి నగరపాలక సంస్థ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామికి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారులు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేకూరేలా లా చూస్తానని హామి ఇచ్చాడు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు సుధాకర్, లక్ష్మినారాయణ.. వరప్రసాద్,హనుమంత్, శివశంకర్, ముత్యాలు, నరేష్, భగీరథరెడ్డి, విమల, మృధుల, మోలాలమ్మదేవి, హారతి తదితరులు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అహర్నిశలు కష్టపడి ప్రభుత్వం చేపట్టిన పథకాలపై సర్వేలు చేసి, సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలు చేర్చడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాం. అయితే గత ప్రభుత్వం విధానాలనే ఈ ప్రభుత్వం అవలంభించకుండా సత్వర సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా సీనియారిటి, రోస్టర్ జాబితా మేరకు 01009 పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీల ప్రక్రియ వుండాలని, ఇంతకమునుపు జారీ చేసిన జిఓ నెం. 523ను రద్దుపరచాలని లేకుంటే అమెండ్ చేసి విద్యార్హతను బట్టి పదోన్నతులు వచ్చే విధంగా చేయాలన్నారు. అలాగే నోషనల్ ఇక్రిమెంట్స్ అందరికి మంజూరు అయ్యేలా చూడాలన్నారు. ప్రస్తుతం వున్న రికార్డ్ అసిస్టెంట్ పేస్కేలును జూనియర్ అసిస్టెంట్ పేస్కేలుగా వర్తింపజేయాలని, రేషనలైజేషన్లో భాగంగా మిగిలిన ఉద్యోగులను ఏవిధంగా పథకాలను నేరుగా ప్రజలు చేర్చడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాం, అయితే గత ప్రభుత్వం విధానాలనే ఈ ప్రభుత్వం అవలంభించకుండా సత్వర ప సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా సీనియారిటీ, రోస్టర్ జాబితా మేరకు పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీల ప్రక్రియ వుండాలని, ఇంతకమునుపు జారీ చేసిన జిఓ నెం.523ను రద్దువరచాలని లేకుంటే అమెండ్ చేసి విద్యార్హతను బట్టి పదోన్నతులు వచ్చే విధంగా చేయాలన్నారు. అలాగే 016:02 నోషనల్ ఇక్రిమెంట్స్ అందరికీ మంజూరు అయ్యేలా చూడాలన్నారు. ప్రస్తుతం వున్న రికార్డ్ అసిస్టెంట్ పేస్కేలును జూనియర్ అసిస్టెంట్ పేస్కేలుగా వర్తింపజేయాలని, రేషనలైజేషన్లో భాగంగా మిగిలిన ఉద్యోగులను ఏవిధంగా సర్దుబాటు చేస్తారో తెలియజేసి బదిలీలు చేపట్టాలన్నారు. జి.ఓ నెం.5ను సవసరించి ఉద్యోగుల ఆర్థిక పరిస్థితులు ఉల్లా దృష్టిలో పెట్టుకుని సొంతమండలాల్లోకి బదిలీలు కల్పించేలా చూడాలని, సర్వీసు రూల్స్, జాబ్చార్ట్, ఉద్యోగులను తమ మాతృశాఖలకు కేటాయించాలని, విధుల పట్ల సరైన గైడెన్స్ పొందువరచాలన్న తదితర ప్రధాన డిమాండ్లతో ఉద్యోగులు ఆందోళన చేపట్టారన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

**ఓబులదేవరచెరువు, జూన్ 6, ప్రభాతవార్త**

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తహసిల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ శివరామ్ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం యోగ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యోగాతో మానసిక వత్తిడి, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగ ప్రాధాన్యత, ఉపయోగం గురించి వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఫిజికల్ డైరెక్టర్ గోపినాథ్, యోగా శిక్షులు పుల్లప్ప యోగసనాలు వేయించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనంతాచారి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసుల రెడ్డి, ఎంపిడిఓ శివరాం ప్రతాప్ రెడ్డి, ఎస్సై మల్లికార్జున రెడ్డి, జడ్పీ మాజీ సభ్యులు పిట్టా ఓబుళరెడ్డి, ఎంపిపి తుమ్మల పర్వీన్ భాను, అంగన్వాడీ సూపర్వైజర్ విజయ కుమారి, ఐకెపి ఏసి రవీంద్ర, డాక్టర్ భాను ప్రకాష్, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, ఎంఇఓ రమణ, సురేష్, యోగ శిక్షకులు ఫిజికల్ డైరెక్టర్ గోపీనాథ్, పుల్లప్ప, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది రమణ, పద్మనాభ రెడ్డి, శ్రీనివాసులు, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, రైయిన్బో పాఠశాల కరస్పాండెంట్ జయసింహారెడ్డి, టిడిపి మాజీ కన్వీనర్లు రాజారెడ్డి, రామానాయుడు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, అంగన్వాడీ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, పాఠశాల పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా యోగ దినోత్సవం

**తనకల్లు, జూన్ 21 ప్రభాతవార్త**



యోగా చేస్తున్న దృశ్యం

మండలంలోని బాలసముద్రం పంచాయతీలో శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు యోగాంధ్ర దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీజంబులింగేశ్వర శివాలయం సమీపంలో పంచాయతీ సెక్రెటరీ అంజి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముసలిరెడ్డి యోగ గురించి ప్రతి ఒక్కరికి చక్కగా వివరిస్తూ యోగాసనాలు చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సర్పంచు బుగిడే చంద్ర, పంచాయతీ సెక్రెటరీ ఆంజనేయులు, ఆసుపత్రి డెవలప్‌మెంట్ డైరెక్టర్ సోంపాలెం నాగభూషణం, మాజీ సర్పంచు గోవిందు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పిజి మల్లికార్జున, వాల్మీకి అశోక్, ఎంపిటిసి అమర్, బాగేపల్లి అశోక్, బాలకృష్ణ, సచివాలయం సిబ్బంది గణేష్, బాబా, ఫర్యానా, ప్రీతి, అంగన్‌వాడి రాణి, ధనమ్మ, ఆశా వర్కర్లు అలివేలు, రమణమ్మ, ఆనిమేటర్లు రజిని, రమాదేవి, ఫీల్డ్ అసిస్టెంట్లు వేణు, పులి, మహేష్, వేణుగోపాల్‌నాయుడు, వెంకటరమణ, అప్ప విశ్వనాథ్, సత్యనారాయణ, శ్రీధర్, ఓబులేసు, నరసింహులు, శివ, రాము, ఆదినారాయణ, తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## చంద్రబాబునగర్‌లో రోడ్డులో పగిలిన కల్వర్టు

**- ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు.**

**- టిడిపి నాయకులకు అధికారులకు తెలిపిన స్పందించడం లేదు.**

**- పంచాయతీలోని చిన్న సమస్య పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం.**

**- స్థానిక ఎంపీటీసీ మహబూబ్ బీ సాధిక్.**

**అనంతపురం రూరల్, జూన్ 21 ప్రభాతవార్త**



చంద్రబాబు నగర్ రోడ్డులో పగిలిన కల్వర్టు

అనంత రూరల్ మండలం రుద్ర పేట గ్రామపంచాయతీలోని చంద్రబాబు నగర్ వెళ్లే రోడ్డులో గల కల్వర్ పగిలిపోయి చంద్రబాబు నగర్ నుంచి నగరానికి వెళ్లే, నగరం నుంచి చంద్రబాబు నగర్ కు వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి కావడం జరుగుతుందని ఈ సమస్యను ఈనెల 17న మండల సర్వసభ్య సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యేకు, స్థానిక టిడిపి నాయకులకు, అధికారుల దృష్టికి తీసుకు పోయిన ఈ సమస్యకు ఎటువంటి పరిష్కారం చూపడం లేదని స్థానిక ఎంపీటీసీ మహబూబ్ బీ సాదిక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో అనంత అర్బన్ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి ఆధ్వర్యం లో రుద్రంపేట పంచాయతీ అభివృద్ధి బాటలో నడిచిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రస్తుతం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పంచాయతీ అభివృద్ధిని గాలికి వదిలేసారని, అందుకు నిదర్శనం చంద్రబాబు నగర్ లో డ్రైనేజీ కాలువ పగిలిపోయి వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయమే అన్నారు. ఇంత చిన్న సమస్యను పరిష్కరించడంలో ఎమ్మెల్యే, స్థానిక టిడిపి నాయకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైనా పగిలిపోయిన డ్రైనేజీ కాలవకు మరమ్మతులు చేయించి వాహనదారులు ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని లేనిపక్షంలో, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఆదేశాలతో చంద్రబాబు నగర్ లోని వాహనదారులు ప్రజలతో కలసి చందాలు వేసుకుని మేమే పగిలిన కల్వర్టుకు మరమ్మత్తు పనులు చేయిస్తామని ఆమె తెలిపారు.

## ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి వేమ యాదవ్**

**కదిరి, జూన్ 21 ప్రభాతవార్త**

విచారణ పేరుతో ఇద్దరు మహిళలను విచక్షణ రహితంగా చితకబాదిన ఎస్ఐ వలి బాషాపై చర్యలు తీసుకోవాలని సత్యసాయి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమ యాదవ్ డిమాండ్ చేశారు. నంబులపూలకుంట మండలంలో యువకుల మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణపై రఫి అనే వ్యక్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణలో భాగంగా శనివారం ప్రశాంత్ అనే యువకుడిని స్టేషన్‌కు పిలిపించి, ఎస్ఐ వలీబాషా, మరో కానిస్టేబుల్ చితకబాదారన్నారు. అడ్డొచ్చిన ప్రశాంత్ తల్లి పార్వతమ్మ, అవ్వ వె వెంకటలక్ష్మిలను పోలీసులు తీవ్రంగా కొట్టడంతో గాయాలపాలై పార్వతమ్మ అనే మహిళకు నోటి దంతాలు ఊడాయన్నారు. ఈమె స్థానిక కదిరి ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోందని, మహిళ అని చూడకుండా తీవ్రంగా కొట్టిన ఎస్ఐపై చర్యలు తీసుకోవానలి బాధిత కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## హరీష్ పాఠశాలలో యోగా దినోత్సవం

**కదిరి, జూన్ 21 ప్రభాతవార్త**

కదిరి రూరల్ పరిధిలోని ఎరుకుల వాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్.కిరణ్ అధ్యక్షతన వ్యాయామ ఉపాధ్యాయులు ఖాదర్‌వలి, ప్రసన్న కుమార్‌లు విద్యార్థులకు యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరు యోగా చేయాలని సూచించారు. యోగా వల్ల మానసిక, శారీరక దృఢత్వం ఉంటుందని, విద్యార్థి దశ నుంచే యోగా అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న విద్యార్థులు

## మద్యం దుకాణాలు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

- డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

**కదిరి, జూన్ 21 ప్రభాతవార్త**

ప్రభుత్వ నిబంధనలను లైసెన్స్ కలిగిన మద్యం దుకాణ యజమానులు కచ్చితంగాపాటించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీకమిషనర్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ నాగమద్దయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత కేసుల పురోగతిపై కదిరి, తనకల్లు, ఎక్సైజ్ సిఐలతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా తయారీ దారులపై నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. సెప్టెంబర్ 30వ తేదిలోపు కదిరి, తనకల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలు నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చి దిద్దాలన్నారు. నాటుసారా తయారీకి పదే పదే సహకరిస్తున్న వ్యక్తులపై పిడియాక్టు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదే సందర్భంలో కదిరి, తనకల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ మద్యం దుకాణాదారులు ప్రభుత్వ నిబందనలను పాటించి, సమయపాలన పాటించానలి లేని పక్షంలో కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో సత్యసాయి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందునాయక్, ఏఇఎస్ నరసింహులు, కదిరి, తనకల్లు ఎక్సైజ్ సిఐలు రామ్మోహన్, మారుతి, ఎస్ఐ శ్రీధర్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

- భారీగా తరలివచ్చిన అధికారులు, విద్యార్థులు



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

**అమడగూరు, జూన్ 21 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణంలో శనివారం ఉదయం 6 గంటలకు తహశీల్దార్ రామనాథరెడ్డి, ఎంపిడిఓ మునెప్ప ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో దాదాపు 500 మంది పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ వయసుతో సంబంధం లేకుండా యోగాసనాలను చేయవచ్చన్నారు. అనంతరం అధికారులు, వైద్య సిబ్బంది మాట్లాడుతూ భారత సంస్కృతిని పరంపరలను తెలియచేసే యోగాసనాలను ప్రతిరోజు ఉదయం అభ్యాసం చేయాలని, వాటివల్ల మానసిక, శరీరక ఉపశమనం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన భారత ప్రధాని నరేంద్రమోడీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొనిదెల పవన్‌కళ్యాణ్, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని వారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వై.రమణారెడ్డి, డాక్టర్ అపర్ణ, బాబా ఫక్రుద్దీన్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహులు, ఎనర్జీస్ ఏపిఓ మధుసూదన్‌రెడ్డి, మండల బిజెపి అధ్యక్షులు రామ్‌శెట్టి వేమనారాయణ, కెజిబివి పాఠశాల ఎస్ఓ, సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, సచివాలయం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, సిబ్బంది వందలాది మంది యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## యోగ అనేది ప్రతి ఒక్కరికి అవసరం





యోగ ఆసనాలతో ధ్యానం చేస్తున్న దృశ్యం

**నల్లచెరువు జూన్ 21 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శనివారం మండల అభివృద్ధి అధికారి రఘునాథ్ గుప్తా, ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు స్కూల్ పిల్లలతోటి యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు అంతర్జాతీయ యోగా దినోత్సవం లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టి వారి ఆదేశాల మేరకు అధికారులతోటి విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని యోగ ఆసనాలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ తిరుపాల్ నాయక్. మాట్లాడుతూ యోగ అనేది ప్రతి ఒక్కరికి అవసరం అని ఉదయం ఏదో ఒక సమయంలో రోజు వారి ప్రతి ఒక్కరూ యోగ చేసుకుంటే మనిషి ప్రశాంతత ఆరోగ్యంగా అభివృద్ధి చెందుతారని మనిషికి సర్వరోగ నివారణకి యోగ చాలా ప్రాముఖ్యతని మన శరీరంలో పేరుకుపోయిన మలిన పదార్థాలు బయటకు పోయి రక్తప్రసరణ బాగా జరగదు అని మనుషులు ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో. తాసిల్దార్ రవికుమార్ ఈ ఓ ఆర్ డి శకుంతల ప్రత్యేక అధికారి సూర్యనారాయణ. గ్రామ సర్పంచ్ పంచరత్నమ్మ. హెచ్ఎం విజయలక్ష్మి డాక్టర్ అలేఖ్య ఆర్ ఐ లక్ష్మీదేవి. పంచాయతీ సెక్రెటరీ నరేష్ కుమార్. పి ఈ టి షఫీ, యోగ టీచర్ రాంబాబు, నాయకులు మాజీ ఎంపీపీ మాబు సాహెబ్. నాగభూషణ నాయుడు. అబ్దుల్ ఖాదర్. జక్క లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే పరిటాల సునీతకు కృతజ్ఞతలు తెలియజేసిన కన్వీనర్ టిడిపి నాయకులు



ఎమ్మెల్యే పరిటాల సునీతాను సన్మానిస్తున్న కన్వీనర్ టిడిపి నాయకులు.

**అనంతపురం రూరల్, జూన్ 21 ప్రభాతవార్త**

అనంతపురం రూరల్ మండల టీడీపీ కన్వీనర్ గా 2వ సారి ఎన్నికైన జింకా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శెక్షావలి నాయుడు, రూరల్ మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు,అనంతపురం క్యాంప్ కార్యాలయంలో రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీతమ్మను కలసి గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

## మనిషి జీవితంలో యోగ ఒక భాగం కావాలి



బాలికల ఉన్నత పాఠశాలలో యోగా సాధనలో అధికారులు కూటమి నేతలు

**బత్తలపల్లి,జూన్ 21 ప్రభాతవార్త**

నేటి సమాజంలో మానవుడు నిత్యము వివిధ మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని, మానవుని జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలంటే యోగ జీవితంలో ఒక భాగం కావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన బత్తలపల్లిలోని బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు గ్రామ సచివాలయాలు,ఆర్డిటి ఆసుపత్రి తదితర ప్రదేశాలలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉత్సాహంగా



ఆర్డిటి ఆసుపత్రిలో యోగాంధ్రలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థినిలు, సిబ్బంది

వేడుకలా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన యోగా వేడుకల్లో మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు,ప్రజాప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు,కూటమి నేతలతో పాటు ప్రజలు హాజరై వివిధ రకాల యోగాసనాలు వేశారు.మండల కేంద్రమైన బత్తలపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యోగా వేడుకల్లో ఎంపీడీవో నరసింహనాయుడు, తహసిల్దార్ స్వర్ణలత,డిప్యూటీ ఎంపీడీవో క్రిష్టప్ప,పరిపాలన అధికారి శ్రీనివాసులుతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు హాజరై యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యోగ చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవటంతో పాటు మానసిక ఉల్లాసం,క్రమశిక్షణ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని ముఖ్యంగా మానసిక ఒత్తిడిని జయించి సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి యోగా శక్తిలా పనిచేస్తుందన్నారు.ప్రతి మనిషికి జీవితంలో యోగా భాగం కావాలన్న ఉద్దేశంతోనే అంతర్జాతీయ యోగాడే రాష్ట్రంలోని విశాఖపట్నంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో యోగంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూన్నారన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**వజ్రకరూర్ జూన్ 21 ప్రభాతవార్త**



లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను శనివారం అనంతపురంలోని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ క్యాంప్ కార్యాలయంలో శనివారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. మండల వ్యాప్తంగా 11మంది లబ్ధిదారులకు రూపాయలు 6, 64, 398లు మంజూరయ్యాయి. వాటిని ఆయన లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జిపి కొండయ్య, దస్తగిరి మోహన్ రావు, సర్పంచ్ సుదీప్, మండి ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత తోనే స్వచ్ఛ మైన ఆరోగ్యం

**బత్తలపల్లి, జూన్ 21 ప్రభాతవార్త**



ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు

ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పరిసరాల పరిశుభ్రత పాటిస్తే స్వచ్ఛమైన ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో నరసింహనాయుడు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. స్వచ్ఛమైన ఆరోగ్యం కావాలంటే పరిసరాల పరిశుభ్రత పాటు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. విరివిగా మొక్కలు నాటడం వల్ల ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందన్నారు. గ్రామాలలో పరిశుభ్రత పాటిస్తే రాష్ట్రం మొత్తం స్వచ్ఛ ఆంధ్ర గా మారుతుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి జి.శ్రీనివాసులు, ఉప మండల పరిషత్తు అభివృద్ధి అధికారి పి.క్రిష్ణప్ప, గృహనిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు విశ్వనాథ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అమరాపురంలో ప్రపంచ యోగ దినోత్సవ వేడుకలు



యోగ నిర్వహిస్తున్న దృశ్యం

**అమరాపురం జూన్ 21 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన అమరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానము నందు శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఎంపీడీవో రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలు విద్యార్థులు యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పిటిసి నరసింహామూర్తి, తెలుగుదేశం పార్టీ నాయకులు మారుతీ ప్రసాద్, అమరాపురం నాగరాజు, డీలర్ తిప్పేస్వామి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నప్ప మరియు అధికారులు పరిపాలన అధికారి ఆరాధ్య, వ్యవసాయ అధికారి మంజునాథ్, ఈ ఓ ఆర్ డి సుధాకర్, ఏపీఎం ముత్యాలప్ప, ఏపీఓ శివన్న, రెవిన్యూ ఇన్స్పెక్టర్ విన్సెంట్ పాల్, ఇరిగేషన్ ఏఈ భార్గవ్, యోగ మాస్టర్లు నాగభూషణ్ ,కిషోర్ ,లింగరాజు తదితరులతోపాటు విద్యార్థులు అధికారుల బృందం ప్రజలు పాల్గొన్నారు. యోగ ద్వారా మనిషికి అనేక లాభాలు ఉన్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ప్రతి పాఠశాలలో కూడా యోగ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

## ఘనంగా అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవ వేడుకలు

**తాడిమర్రి జూన్ 21 (ప్రభాతవార్త)**



అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొన్న మండల అధికారులు, నాయకులు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ 11వ యోగా వేడుకల్లో ఎంపీడీవో వెంకట రంగారావు తాసిల్దార్ భాస్కర్ రెడ్డి డిప్యూటీ ఎంపీడీవో విజయ్ శేఖర్ నాయుడు ఎంఈఓ లు కృష్ణమోహన్ వెంకటేష్ ఏవో శేఖర్ నాయక్ ఏపిఓ అనిల్ కుమార్ రెడ్డి బిజెపి మండల కన్వీనర్ దేవర రామ్మోహన్ తో పాటుతో పెద్ద ఎత్తున విద్యార్థిని విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



యోగా చేస్తున్న విద్యార్థిని విద్యార్థులు, అధికారులు

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యోగాచేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవటం తోపాటు మానసిక ఉల్లాసం, దేహదారుఢ్యం క్రమశిక్షణ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని అలాగే మానసిక ఒత్తిడిని జయించి సంతోషంగా జీవించేందుకు యోగా ఒక ఔషధములా పనిచేస్తుందని జీవితంలో ప్రతి మనిషికి యోగా ఒక భాగం కావాలన్నా ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్ష అని ఎంపీడీవో రంగారావు తెలిపారు. అదేవిధంగా తాడిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన యోగా డే కార్యక్రమానికి సత్యసాయి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సయ్యద్ మోలా విద్యార్థినీ విద్యార్థులతో కలిసి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి తో పాటు కళాశాల సిబ్బంది కి సూచనలు సలహాలు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు,మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పించిందని అన్నారు.

## డిప్యూటీ తహసిల్దార్ కే స్వాతిని అభినందించిన బిజెపి నాయకులు

**పెనుకొండ జూన్ 21 ప్రభాతవార్త**



డిప్యూటీ తహసిల్దార్ కే స్వాతిని అభినందిస్తున్న బిజెపి నాయకులు

పట్టణములోని తహసిల్దార్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కే స్వాతిని స్థానిక బిజెపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు శనివారం నాడు బిజెపి నాయకులు ఎనుముల రామకృష్ణ రామాంజనేయులు ముత్యాలమ్మ రవి హనుమంతులు శాలువా కప్పి పూలమాలలు వేసి అభినందించారు.

## రైతులకు దాణా పంపిణీ చేసిన జడ్పిటిసి



దాణాను పంపిణీ చేస్తున్న జడ్పిటిసి

**అగళి, జన్ 21 ప్రభాతవార్త**

మండల రైతులకు మూగజీవాలు మేపుకోవడానికి పశువుల దాణాను జడ్పిటిసి ఉమేష్ పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతులకు ఎన్నో సేవలు అందిస్తోందని, మూగజీవాలకు ఇన్సురెన్స్ కడితే ప్రీమియం కడితే ఇన్సురెన్స్ సౌకర్యం కూడా కలదని తెలిపారు. గొర్రెలకు ఉచితంగా వ్యాక్సినేషన్ చేయడం జరుగుతుందని, అదే విధంగా సబ్సిడి ధరలతో జొన్నలు లాంటివి గతంలో పంపిణీ చేశామని తెలిపారు. పశుసంవర్ధక శాఖ నుంచి కూటమి ప్రభుత్వం ఎన్నో సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు భర్త హనుమంతరాయప్ప, నాయకులు భూతరాజు, లింగరాజు, రెడ్డి, వెటర్నరీ ఉద్యోగి శ్రీనివాస్, నాగోజప్ప, గణేష్ పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం

**రామగిరి, జూన్ 21 ప్రభాతవార్త**



మండల కన్వీనర్, ప్రధాన కార్యదర్శిలను అభినందిస్తున్న దృశ్యం

తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం తాము శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని మండల కన్వీనర్ గా రెండవసారి ఎన్నికైన సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఆవుల ముత్యాలు తెలిపారు. శనివారం వారి ఇద్దరు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు వారిని అభినందించారు. ఈ సందర్భంగా సుధాకర్, ముత్యాలు మాట్లాడుతూ.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాలతో పార్టీని ముందుకు తీసుకెళ్తామన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులను అందరిని కలుపుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి ప్రజాబలం పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయాకులు ఎస్.ఆంజినేయులు, అక్కులప్ప, పేపర్‌శీన, నగేష్‌నాయుడు, క్రాంతి, సురేష్, డీలర్ నరసయ్య, నాగరాజు, గుర్రంశీన, మారెన్న పాల్గొన్నారు.

## యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం-కె.విశ్వనాథ్



యోగా చేస్తున్న దృశ్యం

**మడకశిర జూన్ 21 ప్రభాతవార్త;**

ప్రతిరోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని బుళ్లసముద్రం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 11 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలపరిధిలోని బుళ్లసముద్రం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.విశ్వనాథ్ ఉదయం 6.30 గంటలకు పాఠశాల ఆవరణంలో విద్యార్థులు పాఠశాల సిబ్బంది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకొన్నారు. విద్యార్థులు పాఠశాల సిబ్బంది యోగాసనాలు వేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ యోగా అనేది మనిషి జీవితాన్ని ఆరోగ్యంగా ఆనందంగా సాత్వికంగా తీర్చిదిద్దే ఒక శక్తివంతమైన సాధనమని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ ప్రతిరోజు కనీసం 30 నిమిషాలు అయిన యోగ చేయాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి పల్లకీ ఉత్సవం

**- స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించిన భక్తులు**

**ఉరవకొండ, జూన్ 21 ప్రభాతవార్త**



లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం దృశ్యం

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం జేష్ఠ మాసం శుద్ధ ఏకాదశి శనివారం సాయంత్రం లక్ష్మీనరసింహుని పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీరి ్చగా ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉరవకొండలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం

**- ప్రతిజ్ఞ చేసిన కేఆర్ఆర్సీ ఎస్‌డీసీ, బీసీ సంక్షేమశాఖ డీడీ**

**ఉరవకొండ, జూన్ 21 ప్రభాతవార్త**




ప్రతిజ్ఞ చేస్తున్న కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారి తదితరులు

రాష్ట్ర ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం శనివారం ఉరవకొండ పట్టణంలో జరిగింది. ప్రతి నెలా మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై వివిధ శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణకు వచ్చే పంచాయతీ కార్మికులకు తడి, పొడి చెత్తను వేరు వేరుగా అందించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞచేశారు. ఈ కార్యక్రమంలో కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూ కొఠారి, తహశీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, ఈవోఆర్డీ సతీష్‌కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వెంకటస్వామి చౌదరి, మండల పరిషత్ ఏవో శంకర్, ఎంఈవో ఈశ్వరప్ప, మేజర్ పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్, యోగా గురువు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యామిత్ర కిట్లు పంపిణీ

**వజ్రకరూరు జూన్ 21 ప్రభాతవార్త**




విద్యార్థులకు విద్యా మిత్రా కిట్లను అందజేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

మండలంలోనీ చాబాల గ్రామ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకం కింద విద్యార్థులకు యూనిఫార్మ్, షూస్‌సాక్స్, బ్యాగులు, బెల్టు, టై, టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్, డిక్షనరీ లను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అందజేశారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. విద్యా విధానంలో అనేక రకాల మార్పులను తెచ్చి కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యను బోధిస్తున్నారన్నారు. విద్యతోపాటుగా నాణ్యమైన సన్నబియ్యంతో కూడిన భోజనాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద రుచి కరమై ఆహారాన్ని అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రి స్వామి ,వి మహేష్ , స్టార్ డీలర్ నరసింహులు, కేటి నాగరాజు, దాసరి నాగరాజు, జి మహేష్, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్లను పరిష్కరించాలని వినతి

**అగళి, జూన్ 21 ప్రభాతవార్త**



తశీహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సర్వేయర్లు

అగళి మండలంలోని సర్వేయర్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారు సుబ్బారావుకు అందజేశారు. ఆఫ్ ఏపి సర్వేయర్ అసోషియేషన్ అగళి మండలం వారు రీ సర్వే చేస్తున్న సర్వే ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ తమ డిమాండ్లను నెరవేర్చాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు కార్తిక్, లికిత్ తదితరులు ఉన్నారు.

## అన్నదాత సుఖీభవ సాయం వెంటనే బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి

**-కౌలు రైతుల సంఘం నియోజకవర్గ కార్యదర్శి పెద్దముష్టూరు వెంకటేష్**



విలేఖరులతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు

**ఉరవకొండ, జూన్ 21 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ సాయంను వెంటనే రైతులు, కౌలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కౌలు రైతుల సంఘం నియోజకవర్గ కార్యదర్శి పెద్దముష్టూరు వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. అన్నదాత సుఖీభవ సాయం 20వేల రూపాయల వంతున 21వ తేదీన బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిందని అయినా ఖాతాల్లో మాత్రం డబ్బు పడకపోవడంతో రైతులు, కౌలు రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. ఇప్పుడేమో జూన్ నెలాఖరులో వేస్తామని చెబుతుండటం సబబు కాదన్నారు. వర్షాలు కురిసాయని పంటలు పెట్టుకోవడానికి రైతుల చేతిలో చిల్లిగవ్వలేక అవస్థలు పడుతున్నారని వెంటనే ఖాతాల్లో అన్నదాత సుఖీభవ సాయం జమ చేయాలన్నారు. లేకుండా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకన్న, తిప్పయ్య, ఆంజినేయులు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



యోగాసనాలు వేస్తున్న దృశ్యం

**గుడిబండ జూన్ 21 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో 11వ అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు.యోగాలోని వివిధ ఆసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డాక్టర్ కేశవరెడ్డి,డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానవ శరీరంలోని రుగ్మతులను దూరం చేసుకోవచ్చని. శరీరాన్ని రోగాల బారి నుండి రక్షించుకోవచ్చని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మనం తినే కలుషితమైన ఆహారం వలన అనేక రకాల రోగాలు మానవులకు సంక్రమిస్తాయని యోగా చేయడం వల్ల అటువంటి రోగాల నుండి బయటపడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు నాయక్,పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, ప్రజా ప్రతినిధులు, తెదేపా క్లస్టర్ ఇంచార్జ్ లక్ష్మీనరసప్ప,లాయర్ శివకుమార్, తెదేపా జిల్లా లింగాయత్ సంఘం అధ్యక్షులు దుర్గేష్, ఎంపీటీసీ వనజాశశిధర్, చెరువుఆయకట్టు అధ్యక్షుడు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల వ్యాప్తంగా గ్రామ సచివాలయంలోని ఉద్యోగులు తమ తమ సచివాలయ ప్రాంగణంలో యోగాంధ్ర పై ప్రజలకు అవగాహన కల్పించి యోగ ఆసనాలను చేశారు.

## యోగ తో రోగాలు మాయం

**మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్ బాషా**

**కనేకల్లు జూన్ 21 ప్రభాతవార్త**

ప్రతిరోజు ఉదయాన్నే యోగా చేయడం వలన పరిపూర్ణంగా ఆరోగ్యంగా మనిషి ఉండగలడని రాయదుర్గం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్ బాషా అన్నారు. కణేకల్ మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారెవిన్యూ విఆర్ఓ పవన్,ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగ యొక్క ఆవశ్యకతను గూర్చి అధికారులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు ఆనంద్ రాజ్, చిక్కణ్ణేశ్వర చెరువు సంఘము అధ్యక్షులు బీటీ రమేష్, చంద్రశేఖర్ గుప్తా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్ బాషా, కురుబ నాగరాజు, వార్డు మెంబర్ నాగభూషణం,తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవన విధానానికి యోగ ఎంతో దోహదపడుతుంది. ఎంపీడీవో రామ్ కుమార్.

**సామూహిక యోగా కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు.**

**రొద్దం. జూన్ 21 ప్రభాతవార్త.**



యోగా చేస్తున్న అధికారులు కూటమి నాయకులు.

నేటి సమాజంలో రోజురోజుకు మానసిక ఒత్తిళ్ల సమస్యలు అధికమవుతున్నాయి అతి చిన్న సమస్యను పెద్దదిగా ఊహించుకుంటూ నిత్యం ఆలోచనలతో సతమతమవడం జరుగుతోందని అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో ఎంపీడీవో రాంకుమార్ కూటమి నాయకులు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రమైన రొద్దం జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఆవరణంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు ఎంపీడీవో ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటలకే యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు వక్తలు మాట్లాడుతూ గాలి నీరు వాతావరణ ఆహార కాలుష్యంతో అనేక జబ్బులు అనారోగ్య సమస్యలు ఈరోజున వెంటాడుతున్నాయి వీటన్నిటిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ మనల్ని మనం చక్కగా తీర్చిదిద్దుకోవటానికి అను నిత్యం యోగ కీలకపాత్ర వహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ అనారోగ్య బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకొని యోగాను చేయడం వల్ల ప్రతిఒక్క కుటుంబం చాలాఆనందంగా ఉంటుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉదయం 6 గంటలకే తాసిల్దారు ఎంఈఓ జయ భాస్కర్ ఇవారెడ్డి గోవిందప్ప హెడ్మాస్టర్ లక్ష్మీనారాయణమ్మ వైద్యాధికారి సోమశేఖర్ కూటమి నాయకులు నరహరి, మాధవ నాయుడు, చంద్రమోళి, చిన్నప్పయ్య, టైలర్ ఆంజనేయులు, వీరాంజనేయులు, యునర్సింహులు, సిద్ధన్న, ఉమాశంకర్, పెద్ద చెక్కల రెడ్డి, మహమ్మద్ రఫీ, బీజేపీ నాయకులు రవిశంకర్, ఈ పవన్ కుమార్, రాజా, తిప్పేసామే, స్కూల్ సిబ్బంది విద్యార్థులు, గ్రామ ప్రజలు, పలు సచివాలయ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 50 శాతం రాయితీ పై రైతులకు పశువుల దాణ సరఫరా....

**ధర్మవరం రూరల్ జూన్ 21 ప్రభాతవార్త**



పాడి రైతులకు సబ్సిడీ దాణా బస్తాలు అందజేస్తున్న కూటమి నాయకులు

50 రాయితీపై పశువుల దాణ రైతులకు సరఫరా చేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ శేఖర్ తెలియజేశారు. మండల కేంద్రంలోని చింతలపల్లి గ్రామం నందు శనివారం మండల తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మహేష్ చౌదరి, విజయ్ చౌదరి, పశువైద్యాధికారి డాక్టర్ శేఖర్ సుమారు 80 మంది పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో దాణా ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం 1110,రూపాయలు విలువ గల50,కిలోల దాణా ప్యాకెట్లను 555 రూపాయలకే పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకొని పాడి పరిశ్రమను మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

## నేడు మంత్రి సత్య కుమార్ యాదవ్ ధర్మారం రాక

**ధర్మవరం రూరల్ జూన్ 21 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి స్థానిక ప్రజలు, పార్టీ కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు నేరుగా కలుసుకొని తమ సమస్యలు, అభిప్రాయాలు, వినతులు మరియు అభ్యర్థనలు వెల్లడించవచ్చునని ఆయన తెలియజేశారు.

## గుంతకల్లు మండల సర్వేయర్‌గా ఆర్.మంజుల

**గుంతకల్లు, జూన్ 21 ప్రభాతవార్త**



మండల సర్వేయర్‌గా బాధ్యతలు చేపట్టిన మంజుల

గుంతకల్లు మండల సర్వేయర్‌గా ఆర్.మంజుల శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న సర్వేయర్ మారెప్ప గుత్తికి బదిలీ కాగా, వజ్రకరూరు మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న మంజుల ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో రైతుల భూ సమస్యలతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

# యోగాతో ఆరోగ్యం

వజ్రకరూరు జూన్ 21 ప్రభాతవార్త



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు

మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని మండల అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఉద్యోగులు కలిసి యోగాసనాలను వేశారు. వక్తలు ప్రసంగిస్తూ యోగాతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చు అన్నారు. ప్రతిరోజు యోగాసనాలు వేయడం వలన శరీరంలో పేరుకుపోయిన మలిన పదార్థాలు బయటకు పోతాయన్నారు. ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

అగళి, జూన్ 21 ప్రభాతవార్త



యోగాలో పాల్గొన్న జడ్పిటిసి, తదితరులు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అగళి మండలంలో అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇరిగేపల్లి ఉన్నత పాఠశాలతోపాటు, సచివాలయం వద్ద ఆదర్శపాఠశాల, మధూడి ఉన్నత పాఠశాల, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఉన్నత పాఠశాలల వద్ద యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్పిటిసి ఉమేష్ మాట్లాడుతూ.. యోగా వల్ల మానసిక ఉల్లాసం, ప్రశాంతత దొరుకుతుందని, యోగా చేయడం మూలంగా ఆయుఃప్రమాణం పెరుగుతుందని, రోగ నిరోధక శక్తి వృద్ధి చెందుతుందని, భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్పవరం యోగా అని, భారతదేశంలోనేకాకుండా విదేశాల్లో సైతం కోట్లాది మంది యోగాలో పాల్గొంటున్నారని ఇది భారతీయ జీవన విధానం అని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు సుబ్బారావు, ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, సర్పంచు లక్ష్మిలింగరాజు, మంజు, చరణ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, జడ్పిహెచ్ఎస్ హెచ్ఎం రాఘవేంద్ర, వైస్ ఎంపిపి గాయత్రి హేమంత్, మల్లేష్, మంజు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. అదేవిధంగా మదూడి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దాసే గౌడ, ఉపాధ్యాయులు, యోగాలో పాల్గొన్నారు. ఆదర్శ పాఠశాలలో పిల్లలతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ఈ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు.



అగళి ఆదర్శ పాఠశాలలో యోగా నిర్వహిస్తున్న దృశ్యం

## లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

- యోగాసనాలు వేసిన ఆలయ సిబ్బంది, భక్తులు



పెన్నహోబిళం క్షేత్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు వేస్తున్న సిబ్బంది, భక్తుల దృశ్యం




ఉరవకొండ, జూన్ 21 ప్రభాతవార్త

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఆలయ అర్చకులు బాలాజీ ఆలయ సిబ్బంది, భక్తులతో యోగాసనాలు వేయించి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని అప్పుడే ఎలాంటా అనారోగ్య సమస్యలు, శారీరక, మానసిక ఒత్తిడులు లేకుండా సుఖమయ జీవితం పొందగలుగుతారన్నారు.


## నింబగల్లు జెడ్పీ హైస్కూల్‌లో ఆకట్టుకున్న యోగాసనాలు

-యోగా ఆంగ్ల అక్షరాల ఆకారంలో యోగాసనాలు వేసిన విద్యార్థులు



నింబగల్లు జెడ్పీ హైస్కూల్‌లో యోగా అంగ్ల అక్షరాల ఆకారంలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

ఉరవకొండ, జూన్ 21 ప్రభాతవార్త




జాతీయ జండాతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మండల పరిధిలోని నింబగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే విద్యార్థులు పాఠశాల మైదానంలో యోగాసనాలు వేశారు. యోగా అంగ్ల అక్షరాల రూపంలో విద్యార్థుల యోగాసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హెచ్ఎం, ఉపాధ్యాయులు మాట్లాడుతూ యోగ అనేది భారతీయ జీవన విధానంలో భాగం అయిందని ఆరోగ్యాభిలాషులకు ఇది ఒక వరమన్నారు. గురువులు సూచించిన మేరకు నియమ నిబంధనలు పాటిస్తూ ప్రతిరోజూ యెగ సాధన చేయాలన్నారు. అప్పుడే రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు.

# ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

-విలేఖరుల సమావేశంలో దళిత సంఘాల నాయకుల డిమాండ్



విలేఖరులతో మాట్లాడుతున్న వివిధ దళిత సంఘాల నాయకులు

ఉరవకొండ, జూన్ 21 ప్రభాతవార్త

దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమానపరుస్తూ కులం పేరుతో కించపర్చేలా మాట్లాడిన ఆదోని ఎమెమ్మల్యే పార్థసారథిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో దళిత గిరిజన హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మీనుగ గోపాల్, చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్, మాజీ ఎంపీపీ తిప్పయ్య మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన ఆదోని నియోజకవర్గం ధనాపురం గ్రామంలో కూటమి ప్రభుత్వ విజయోత్సవ కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమానపరుస్తూ ప్రోటోకాల్‌పాటించకుండా కులం పేరుతో దూషించారన్నారు. బీజేపీ ఎమ్మెల్యేగా ఉంటూ దళితులపైన అందులోనూ గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్‌ను కులం పేరుతో అవమానపర్చడమే కాకుండా వేదిక కింద నిలబడమని అవమానపర్చడ హేయమైన చర్యని అన్నారు. ఎమ్మెల్యే వైఖరి దళిత సర్పంచులు, ఎస్సీలను కించపర్చేలా ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తుండగా సాటి మనిషిని మనుషులుగా చూడకుండా కులాల పేరుతో అవమానపర్చే ఇలాంటి ఎమ్మెల్యేపై చట్టపరంగా చర్యలు అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోనాపురం ఎర్రిస్వామి, వెలిగొండ ఓబయ్య, ముష్టూరు ఎర్రిస్వామి, కడమలకుంట పురుషోత్తం, మీనుగ రమేష్‌బాబు, హావళిగి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్య

-ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురైన వైనం

ఉరవకొండ, జూన్ 21 ప్రభాతవార్త



ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మీనుగ వెంకటేష్

పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో నివాసముండే భవన నిర్మాణ కార్మికుడు మీనుగ వెంకటేష్ (32) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే...బెల్దారి పనులు చేస్తూ రోడ్డు పక్కన తోపుడు బండిపై మొక్కజొన్న కంకులు విక్రయిస్తూ జీవనం గడుపుతున్న మీనుగ వెంకటేష్ గత కొంత కాలం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో శుక్రవారంరాత్రి ఇంట్లో ఎవరూలేనిసమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబసభ్యులు అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించినవైద్యులు మృతిచెందాడని నిర్ధారించారు. మృతునికి భార్యలక్ష్మి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం మృతదేహానికి శవ పరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## యోగా సాధనతో శారీరక, మానసిక ప్రశాంతత..!

-11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా ముద్రలో ఉరవకొండ-యోగా సాధన చేసిన కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, బీసీ సంక్షేమశాఖ డీడీ-సామూహిక యోగా సాధనకు పెద్దఎత్తున తరలివచ్చిన వృద్ధులు, పిల్లలు, పెద్దలు

ఉరవకొండ, జూన్ 21 ప్రభాతవార్త



యోగా సాధన చేయిస్తున్న గురువు తాటికొండ వెంకట్



యోగాసనాలు వేస్తున్న కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేస్వామి, తహశీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీవో రవిప్రసాద్ తదితరులు



యోగాసనాలు వేస్తున్న బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి తదితరులు

మానవుడు చక్కని కళాత్మకమైన జీవన విధానమును అలవర్చుకోవడం కోసం భారతీయ సాంప్రదాయం మానవాళికి అందించి అమూల్య సంపద యోగ అని నిత్యం యోగ చేయడం వల్ల సంపూర్ణ అరోగ్యం, మాన సిక ప్రశాంతత పొందవచ్చని కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేస్వామి, బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి, ఎంపీడీవో రవిప్రసాద్, తహశీల్దార్ మహబూబ్‌బాషా అన్నారు. 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఉదయం కామన్ యోగ పోర్టల్ కార్యక్రమం యోగా గురువు తాటికొండ వెంకట్‌చే జరుగగా వారితోపాటు వివిధ శాఖల అధికారులు, వృద్ధులు, పిల్లలు, పెద్దలు పెద్దఎత్తున పాల్గొనగా యోగ సాధన చేయించారు. ఏకధాటిగా గంటపాటు యోగాభ్యాసన కొనసాగించారు. వివిధ రకాల యోగాసనాలు, ప్రాణాయామం వాటివల్ల చేకూరే ప్రయోజనాలను వివరిస్తూ సాధన చేయించారు. అనంతరం అందరికీ ఫలహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సతీష్‌కుమార్, మండల పరిషత్ ఏవో శంకర్, ఎంఈవో ఈశ్వరప్ప, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వెంకటస్వామి చౌదరి, మేజర్ పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా మొక్కలు నాటిన ఎంపీడీవో

కనేకల్లు జూన్ 21 ప్రభాతవార్త

స్వర్ణాంధ్ర స్వచాంధ్రలో భాగంగా కనేకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో విజయసింహారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంచే మొక్కలను నాటించారు. అలాగే ఐ సి డి ఎస్ కార్యాలయ ఆవరణలో ఉన్న గడ్డి మొక్కలను సూపర్వైజర్ శాంతి కుమారి ఆధ్వర్యంలో తొలగించి చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శాంతి కుమారి అంగనవాడి కార్యకర్తలు ఆయాలు. విజయసింహారెడ్డి ఎంపీడీవో విజయ్ సింహ రెడ్డి సూపరిండెంట్ చంద్రమోళి ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ గీజర్‌లో మంటలు చెలరేగి వృద్ధురాలు మృతి

-నివాసగృహంలోని స్నానాల గదిలో ఘటన

ఉరవకొండ, జూన్ 21 ప్రభాతవార్త



మృతి చెందిన వృద్ధురాలు నారాయణమ్మ (ఫైల్‌ఫోటో)



గ్యాస్ సిలెండర్ రెగ్యులేటర్ కాలిపోయిన దృశ్యం

పట్టణంలోని షిర్డి సాయినగర్‌లో నివాసముంటున్న నారాయణమ్మ (75) అనే వృద్ధురాలు గ్యాస్ గీజర్‌లో చెలరేగిన మంటలతో నిప్పంటుకొని శనివారం ఉదయం మృతి చెందింది. పోలీసుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే...మండల పరిధిలోని రేణుమాకుపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు నారాయణమ్మ షిర్డి సాయినగర్‌లోని స్వగృహంలో నివాసముంటోంది. ఉదయం స్నానం చేయడానికిగాను స్నానాల గదిలో గ్యాస్ గీజర్‌ను ఆన్‌చేయగానే రెగ్యులేటర్‌వద్ద నుండి మంటలు చెలరేగి ఆమెను అంటుకున్నాయి. దీంతో వృద్ధురాలు కేకలు పెట్టడంతో పనిమనిషి గమనించి ఆమెను స్థానికుల సాయంతో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకై జిల్లా కేంద్ర ఆసుపత్రికి అక్కడి నుండి వైద్యుల సూచనల మేరకు బెంగళూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మరణించింది. మృతదేహాన్ని తిరిగి ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పరీక్షల అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## 57 మందికి సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.54.41 లక్షలు చెక్కుల పంపిణీ

-అండగా ఉంటామన్న టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, జూన్ 21 ప్రభాతవార్త



సీఎంఆర్‌ఎఫ్ సాయం చెక్కులను అందిస్తున్న టీడీపీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ నియోజవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్దిదారులు 57 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన 54,41,732 రూపాయల చెక్కులను టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు పంపిణీ చేశారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. లబ్దిపొందిన వారిలో ఉరవకొండ మండలానికి చెందిన 17 మందికి, వజ్రకరూరు మండలానికి చెందిన 11 మందికి, బెలుగుప్ప మండలానికి చెందిన 5 మంది, విడపనకల్లు మండలానికి చెందిన 11 మందికి, కూడేరు మండలానికి చెందిన 13 మంది ఉన్నారు. ఈ సందర్భంగా పయ్యావుల శ్రీనివాసులు మాట్లాడుతూ మీకు కష్టం ఎదురైనపుడు మీ కుటుంబానికి పెద్ద కొడుకులుగా ఆదుకుంటామని ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయాన్ని మంజూరు చేయించి అందించడం జరుగుతోందన్నారు.

## ఆర్డీటీకు ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించి న్యాయం చేయండి

-ప్రధాని మోదీకు ఏబీబీఎస్ఎస్ జాతీయ గౌరవాధ్యక్షులు ఎస్.కె.కేశవనాయక్ లేఖ

ఉరవకొండ, జూన్ 21 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న ఏబీబీఎస్ఎస్ జాతీయ గౌరవాధ్యక్షులు ఎస్.కె.కేశవనాయక్

నిస్వార్థంగా పేద ప్రజలకు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఆర్డీటీ స్వచ్ఛంధ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించి న్యాయం చేయాలని అఖిల భారత బంజారా సేవా సంఘం జాతీయ గౌరవాధ్యక్షులు ఎస్.కె.కేశవనాయక్ కోరారు. ఈమేరకుదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకు లేఖ రాసినట్లు శనివారం ఆయన విలేఖరులకు తెలిపారు. ఎస్.కె.కేశవనాయక్ మాట్లాడుతూ 1969 నుండి అనంతపురం, కర్నూల్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు ఉచిత విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, రైతులు, వికలాంగుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలను చేపట్టి సేవలందిస్తోందన్నారు. ఆర్డీటీ సంస్థ పొందుతున్న విదేశీ సహకార నియంత్రణ చట్టాన్ని పునరుద్దరించే అంశంపై వెంటనే స్పందించాలని కోరినట్లు తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

-యోగాసనాలు వేసిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఉరవకొండ, జూన్ 21 ప్రభాతవార్త



కళాశాలలో యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఆదినారాయణ అధ్యక్షతన అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల పీడీ ప్రశాంత్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రాచీన భారతీయ విజ్ఞానం, మానవాళికి అందించిన అపురూప కానుక యోగా అని నాటి నుండి నేటి ఆధునిక యుగం దాకా మానవ జీవితానికి యోగా వరంగా నిలుస్తోందన్నారు. యోగాను స్వామి వివేకానంద మొదటి ప్రపంచానికి తెలియజేశారని యోగా చేయడంవల్ల శరీర దృఢత్వం, మానసిక స్థిరత్వం పొందవచ్చన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించి కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ బి.వెంకటరాముడు, ఎం.పరమేష్, అధ్యాపకులు డాక్టర్ అయ్యన్న, టి.ఎన్.మస్తానప్ప, కె.ఎం.రాజేష్, డాక్టర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కళాశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

# జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50 ఫీజు రాయితీ కల్పించడం పై పాత్రికేయుల హర్షం,

తాడిమర్రి జూన్ 21 (ప్రభాతవార్త)





ఏపీడబ్ల్యూజే ధర్మవరం డివిజన్ సహాయ కార్యదర్శి ఆదినారాయణ, సభ్యులు సిద్దే ఆదినారాయణ రెడ్డి

శ్రీ సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు మరియు కార్పొరేట్ పాఠశాలల్లో 50 ఫీజు రాయితీ కల్పించడం హర్షించదగ్గ విషయమని అందుకు సహకరించిన శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం డివిజన్ సహాయ కార్యదర్శి ముసుగు ఆదినారాయణ (ఆంధ్రప్రభ) ఏపీయూడబ్ల్యూజే సభ్యులు సిద్దే ఆదినారాయణ రెడ్డి (ప్రభాతవార్త) తదితర మండల విలేకరులు అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలకు ప్రజలకు వారధిగా పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కనీసం ఉండడానికి సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇళ్లలో నివసిస్తున్నారని అన్నారు. ఇలాంటి తరుణంలో యుపియుడబ్ల్యూజే అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్ చేతన్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్పలు స్పందించి జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలల్లో 50 ఫీజు రాయితీ కల్పించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై నిత్యం పోరాడుతున్న ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి బాబు, రమేష్ నాయుడు, తో పాటు ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం డివిజన్ అధ్యక్షులు జానపాటి మోహన్ ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

## మాధవరాయుని ఆలయ ప్రాంగణంలో యోగాంధ్రలో ప్రముఖులు

-తెలుగు తమ్ముళ్లు బాలకృష్ణచౌదరి, నరేష్, నిమ్మల శ్రీధర్ చేతుల మీదుగా అన్నదానం -హాజరైన మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి. డిపిఓ సమత

గోరంట్ల, జూన్ 21 ప్రభాతవార్త



యోగ కార్యక్రమంలో మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని గోరంట్ల పట్టణంలోని మాధవరాయుని ఆలయం ప్రాంగణంలో శనివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి, జిల్లా డిపిఓ సమతలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిద్ధి సమాధి యోగ గురువులు సురేష్, భక్తవత్సలం నేతృత్వంలో కార్యక్రమాలకు హాజరైన అధికారులకు, ప్రజలకు యోగ విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ యోగ విన్యాసాలు అనేవి ప్రతి వ్యక్తి జీవితానికి ఎంతో ఉపయోగపడతాయని మెరుగైన ఆరోగ్యం సాధించాలంటే యోగ చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్, మాజీ సర్పంచు నరేష్, ఉత్తమరెడ్డి, జనసేన మండల అధ్యక్షులు సంతోష్‌కుమార్, నిడిమామిడప్ప, సర్పంచు సరోజా నాగేనాయక్ తదితరుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మండల విద్యాశాఖ అధికారి గోపాల్, మేజర్ పంచాయతీ ఇఒ సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచు రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో టిడిపి నేతలు

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

గుత్తి, జూన్ 21 ప్రభాతవార్త



యోగ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి, గుత్తి ఆర్ఎస్ పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విరూపాక్షిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మున్సిపల్ కమీషనర్ జబ్బార్‌మియా, లయన్స్‌క్లబ్ గవర్నర్ విరూపాక్షిరెడ్డి, ప్రెసిడెంట్ శ్రీనివాసయాదవ్, మాజీ ప్రెసిడెంట్ జిలాన్, నేహా, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులుతో పాటు వందలాదిమంది విద్యార్థులు ఔత్సాహికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యోగ ట్రైనర్ సార్జంట్ కృష్ణయ్య వారికి అభ్యాసం చేయించారు. అదేవిధంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, తదితర ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో మహిళలు గాంధీచౌక్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు పాల్గొన్నారు. అలాగే గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాంధ్ర నిర్వహించారు.

## ఘనంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

- యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం : ప్రిన్సిపల్ స్వర్ణలత

చెన్నేకొత్తపల్లి, జూన్ 21 ప్రభాతవార్త



యోగాలు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మండల కేంద్రంలోని చెన్నె కొత్తపల్లి ఆదర్శ పాఠశాలలో 11 అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడుతూ.. యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిరోజు యోగా చేయడం వలన పిల్లలలో మానసిక ఒత్తిడి తగ్గడంతో పాటు మనసు ప్రశాంతతతో మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు. యోగా చేయడంవలన శక్తి,జ్ఞాపకశక్తి, పెంపొందిస్తుంది అన్నారు. విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన రాష్ట్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వరల్డ్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో ముగిసిన భారత్ పోరాటం

**న్యూఢిల్లీ:** స్లోవేనియాలో భారత పోరాటం ముగిసింది, అన్ని ప్యాడ్లర్లు ముందుగానే నిష్క్రమించారు. స్లోవేనియాలోని వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కాంటెండర్ ల్జుబ్లియానాలో జరిగిన రెండో రౌండ్‌లో మానికా బాత్రా నిరాశపరిచింది. మహిళల సింగిల్స్‌లో



భారత ప్రచారాన్ని ముగించి, మనికా చైనాకు చెందిన హి జువోజియా చేతిలో 0-3 (9-11, 6-11, 4-11) తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయింది. 47వ ర్యాంక్‌లో ఉన్న భారత ఆటగాడు తొలి రౌండ్‌లో సానుకూల సంకేతాలను చూపించాడు. పోర్చుగల్‌కు చెందిన క్వాలిఫయర్ ఫుయును 3-0 (11-6, 11-8, 11-5) తేడాతో ఏకపక్ష పోరులో ఓడించాడు. పురుషుల సింగిల్స్‌లో, మానవ్ ఠక్కర్ మొదటి హార్డిల్‌లోనే నిష్క్రమించాడు. ప్రపంచ 38వ ర్యాంకర్ చైనాకు చెందిన జుయే ఫీ చేతిలో 03 (9-11, 6-11, 9-11) తేడాతో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్ జోడీ మణిక మరియు పయాస్ జైన్ కూడా ప్రారంభంలోనే నిష్క్రమించారు. అర్హత రౌండ్లలో పరాజయం పాలైన తర్వాత ప్రధాన డ్రాకు చేరుకున్న ఈ జంట, ప్రారంభ రౌండ్‌లో హాంకాంగ్, చైనాకు చెందిన విబి వింగ్ లామ్-యియు క్వాన్ తో చేతిలో 1-3 (9-11, 12-10, 9-11, 7-11) తేడాతో ఓడిపోయింది. ఇక పురుషుల డబుల్స్ జోడీ మానవ్ ఠక్కర్-మనుష్ షా కూడా మొదటి అడ్డంకిలోనే నిష్క్రమించారు, కొరియాకు చెందిన క్వాలిఫయర్లు కిమ్ మిన్హ్యోక్-పార్క్ గాంగ్హ్యోన్ చేతిలో 1-3 (10-12, 6-11, 11-8, 6-11) తేడాతో ఓడిపోయారు. మొదటి రెండు గేమ్‌లను 10-12, 6-11 తేడాతో ఓడిపోయిన తర్వాత, ఠక్కర్ మరియు షా మూడవ గేమ్‌ను 118 తేడాతో గెలుచుకోవడం ద్వారా కొద్దిగా కోలుకున్నారు. కానీ ప్రత్యర్థులను సాగదీయడంలో విఫలమై, లొంగిపోయి, నాల్గవ గేమ్‌ను 6-11 తేడాతో కోల్పోయారు. కాగా గత వారం, ఈ భారత జంట డబ్ల్యూటిటి కాంటెండర్ స్కోప్జే-2025లో ఫైనల్‌లో దక్షి ణ కొరియాకు చెందిన జోంగ్‌హూన్ లిమ్-జున్‌సంగ్ ఓహ్ చేతిలో 0-3 (9 -11, 7-11, 9-11) తేడాతో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. ఇక మహిళల డబుల్స్ మెయిన్ డ్రాలో భారత క్రీడాకారిణికి ప్రవేశం లభించలేదు.




# పారిస్ డైమండ్ లీగ్‌లో మెరిసిన గోల్డెన్ బాయ్

## నీరజ్ రెండేళ్ల నిరీక్షణకు ఎండ్‌కార్డ్

**న్యూఢిల్లీ:** భారత జావెలిన్ త్రో స్టార్, ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా మరోసారి తన సత్తా చాటాడు. పారిస్‌లో జరిగిన ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచి, రెండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తన తొలి డైమండ్ లీగ్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ విజయం నీరజ్‌కు, భారత అథ్లెటిక్స్‌కు ఎంతో కీలకమైనది. ఈ లీగ్ జావెలిన్ త్రో ఈవెంట్‌లో నీరజ్ చోప్రా అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. తన తొలి ప్రయత్నంలోనే 88.16 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఆ తర్వాత రెండవ ప్రయత్నంలో 85.10 మీటర్లు విసిరాడు. అతని మూడవ, నాల్గవ, ఐదవ ప్రయత్నాలు ఫౌల్‌గా మారినప్పటికీ, చివరి ప్రయత్నంలో 82.89 మీటర్లు విసిరి తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఈ పోటీలో నీరజ్ చోప్రా ప్రధాన ప్రత్యర్థులుగా భావించిన జర్మనీకి చెందిన జూలియన్ వెబర్ 87.88 మీటర్లతో రెండో స్థానంలో నిలవగా, బ్రెజిల్‌కు చెందిన లూయిజ్ మారిసియో డా సిల్వా 86.62 మీటర్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. గత రెండు టోర్నమెంట్లలో (దోహా డైమండ్ లీగ్ 2025, పోలాండ్ ఈవెంట్) జూలియన్ వెబర్ చేతిలో ఓడిపోయిన నీరజ్, ఈసారి ప్రతీకారం తీర్చుకున్నాడు. కాగా పారిస్ ఒలింపిక్స్ ముందు ఈ విజయం కీలకమైంది. పారిస్ ఒలింపిక్స్ 2024లో నీరజ్ చోప్రా రజత పతకం సాధించాడు. అయితే, ఇప్పుడు 2025లో పారిస్‌లోనే డైమండ్ లీగ్ గెలుచుకోవడం రాబోయే ఒలింపిక్స్‌కు సన్నాహకంగా నిలుస్తుంది. ఇది నీరజ్ ఫామ్ ను, అతని మానసిక దృఢత్వాన్ని నిరూపిస్తుంది. ప్రపంచ అథ్లెటిక్స్ లో భారత జాతీయ పతాకాన్ని సగర్వంగా నిలబెడుతున్న నీరజ్ చోప్రాకు ఈ విజయం ఒక గొప్ప ప్రోత్సాహకం.



# ఆసియా కప్ లెగ్ 2లో భారత్ 9 పతకాలతో సరి

## నిరాశ పరచిన రికర్వ్ ఆర్చర్లు

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ లెగ్ 2 టోర్నమెంట్‌లో భారత జూనియర్ ఆర్చర్లు 9 పతకాలతో ముగించారు. సింగపూర్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత జూనియర్ ఆర్చర్లు రెండు స్వర్ణాలు, ఆరు రజతాలు, ఒక కాంస్యంతో సరిపెట్టారు. రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో 10 ఫైనల్స్‌లో ఏడు స్థానాల్లో నిలిచినప్పటికీ, భారత ఆర్చర్లు రెండుసార్లు మాత్రమే పోడియంపై అగ్రస్థానంలో నిలిచారు. మిగిలిన ఫైనల్స్‌లో మొత్తం ఐదింటిలో తీవ్ర నిరాశాజనకంగా ముగించారు. రికర్వ్‌లో ఒక్క స్వర్ణం కూడా గెలుచుకోలేకపోయింది. టాప్‌సీడ్ అయిన పురుషుల జట్టు ఫైనల్‌లో జపాన్ చేతిలో ఓడిపోయింది. విష్ణు చౌదరి, పరాస్ హుడా మరియు జుయెల్ సర్కార్ మూడు సెట్లలో రెండింటిలో 50 మార్కును చేరుకోలేకపోయారు, వరుస సెట్లలో 6-0 తేడాతో ఓడిపోయారు. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లోనూ ఇదే కథ జరిగింది. ఇండోనేషియాతో జరిగిన మ్యాచ్‌లో నాల్గవ సీడ్ చౌదరి-వైష్ణవి పవార్‌లు తప్పులకు పాల్పడ్డారు. 32 పాయింట్లతో ఆరంభం, ఆ తర్వాత వన్‌పాయింటర్‌తో కూడిన వినాశకరమైన రెండవ సెట్, వారి ఓటమిని నిర్ణయించింది. మూడవ మ్యాచ్‌లో కూడా వారు 32-35 తేడాతో ఓడిపోయి రజతంతో ముగించారు. మహిళల రికర్వ్ జట్టు అన్ని వ్యక్తిగత ఎంట్రీలతో పాటు, పతక రౌండ్లకు కూడా చేరుకోలేక పోయింది, రికర్వ్ ఫలితాలు నిరుత్సాహపరిచినప్పటికీ, కాంపౌండ్ విభాగం కొంత ఊరటనిచ్చింది, రెండు బంగారు పతకాలను ఇక్కడే సాధించారు. మహిళల ఈవెంట్‌లో రెండవ సీడ్ తేజల్ సాల్వే 146-144 తేడాతో ఉన్నత ర్యాంక్‌లో ఉన్న షణ్ముఖి నాగ సాయి బుడ్డేపై విజయంతో స్వర్ణం ఖాయం అయింది.

# సౌరాష్ట్ర ప్రో టి20 ఛాంపియన్‌గా కచ్ రైడర్స్

**న్యూఢిల్లీ:** ఒకప్పుడు ఫైనల్‌కు చేరుకునే అవకాశం లేదని భావించిన జట్టు సౌరాష్ట్ర ప్రో టీ20 లీగ్-2025 ఛాంపియన్‌గా అవతరించింది. అద్భుతమైన ధృఢత్వం, సంకల్పాన్ని ప్రదర్శించిన జెఎండి కచ్ రైడర్స్ నిరంజన్‌షా స్టేడియంలో అన్మోల్ కింగ్స్ హలార్‌పై సమగ్ర విజయాన్ని సాధించింది. నిర్ణయాత్మక చివరి మ్యాచ్‌లో 15 బంతులు మిగిలి ఉండగానే 6 వికెట్ల తేడాతే విక్టరీ సాధించింది. కచ్ రైడర్స్ టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకుంది. అన్మోల్ కింగ్స్ తరపున నిహాల్‌చౌదరి, కెప్టెన్ తరంగ్ గోహెల్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. తరంగ్ ఖాతా తెవరకుండానే ఔటయ్యాడు. నిహాల్ (11) అర్థ్ యాదవ్ చేతిలోఔటయ్యాడు. సిద్ధాంత్ రాణా (33) కీలక పాత్ర పోషించాడు. పార్శ్వరాజ్ రాణా(38) అతనికి మంచి సహకారం అందించాడు. దివ్యాంగ్ కనాని (20), యువ్రాజ్ చుడాసమా (13) జట్టుకు తోడ్పడ్డారు. అయితే 19.4 ఓవర్లలో 142 పరుగులకు ఆలౌట్ అయ్యారు. కచ్ రైడర్స్ బౌలర్లలో దేవాంగ్ కరమట 3.14 ఓవర్లలో 5/14 వికెట్లు పడగొట్టాడు. అర్థ్ యాదవ్ 3 ఓవర్లలో 2/22 వికెట్లు తీసుకున్నాడు. కెప్టెన్ ధర్మేంద్రసింహ్ జడేజా (1/17), పార్థ్‌భట్ (1/26), ధ్రువమ్ పటేల్ (1/22) ఇన్నింగ్స్‌లో తలా ఒక వికెట్ తీసుకున్నారు. ఇక 143 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కచ్ రైడర్స్ జట్టుకు సమర్థ్ వ్యాస్, కృష్ణకాంత్ పాఠక్ ఓపెనర్లు అయ్యారు. వారు రెండు వికెట్లు త్వరాగా కోల్పోయి 2.4 ఓవర్లలో 12/2తో నిలిచారు. రెండవ వికెట్ పడటంతో, విశ్వరాజ్ జడేజా, పవన్ పర్మార్ మధ్యలో జత కలిశారు. ఈ జంట మూడో వికెట్‌కు 94 పరుగులు జోడించే ముందు పవన్



(48) ఔటయ్యాడు. జడేజా కూడా ఖాతా తెరవకుండానే ఔట్‌య్యాడు. కానీ విశ్వరాజ్ 17.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించడానికి సహాయం చేశాడు. అతను 64 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. పార్థ్ భూత్ (12) తన వంతు సహకారాన్ని అందించాడు. అన్మోల్ కింగ్స్ హలార్ తరపున ఆదిత్య జడేజా మాత్రమే ఇన్నింగ్స్‌లో వికెట్లు తీయగలిగాడు. అతను 3.3 ఓవర్లలో 3/26 తీసుకున్నాడు.

# చుక్కలనంటిన వెండి

**ముంబై, జూన్ 21:** ప్రస్తుతం బంగారం, వెండి ధరలు ఆకాశన్నంటుతున్నాయి. తులం బంగారం ధర లక్ష రూపాయలు దాటేసింది. ఇక కిలో వెండి ధర విషయానికొస్తే అది కూడా లక్షా ఎప్పుడో దాటేసింది. వెండి ఇప్పుడు కిలోకు రూ.1.10 లక్షలకు చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో అయితే రూ.1.20 లక్షలుగా ఉంది. ప్రస్తుత పారిశ్రామిక డిమాండ్, ఆర్థిక పరిస్థితులు మరియు సాంకేతిక పురోగతి కారణంగా వెండి ధర మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంటున్నారు. వెండి ధర త్వరలో రూ.2 లక్షలకు చేరుకుంటుందని, దేశంలోని విశ్లేషకులు దీనిపై పరిశోధనలు చేస్తున్నారన్న అంచనాలు రిటైల్ పెట్టుబడిదారులలో, మార్కెట్ పరిశీలకులలో సంచలనం సృష్టించాయి. వెండి ధరలు రూ.110,000కి చేరుకున్న తర్వాత ఈ అంచనాకు వచ్చాయి. భారత దేశంలోని మార్కెట్ నిపుణులు వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితిలో వెండి, బంగారం రెండింటికీ డిమాండ్ పెరుగుతోందని అన్నారు. కానీ వెండి ముఖ్యంగా వార్తల్లో ఉంటుంది. ఎందుకంటే ఇది సురక్షితమైన పెట్టుబడి మాత్రమే కాదు, భారీ పారిశ్రామిక డిమాండ్ కూడా వెండికి ఉంది. భౌగోళిక రాజకీయ, ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితుల మధ్య బంగారం ఎల్లప్పుడూ పెట్టుబడిదారుల మొదటి ఎంపిక అని నివేదిక పేర్కొంది. కానీ ఇప్పుడు వెండి కూడా వేగంగా పెరుగుతోంది. ఎలక్ట్రిక్ వాహనాలు, సౌరశక్తి వంటి రంగాలలో వెండికి డిమాండ్ పెరుగుతూనే ఉంది. ఈ రెండు రంగాలు భవిష్యత్తు అవసరాలు,వాటిలో వెండి కీలక పాత్ర పోషిస్తుంది. వెండి ధరలు వచ్చేనెలలో కిలోపై భారీగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. బలహీనమైన యుఎస్ డాలర్, పారిశ్రామిక డిమాండ్, సురక్షితమైన పెట్టుబడి వంటి కారణాల వల్ల వెండి ధర పెరిగే అవకాశం ఉందని, ఇది స్థిరత్వాన్ని అందించడమే కాకుండా 2025లో వెండి ధరల పెరుగుదలను సద్వినియోగం చేసుకోవడానికి కూడా సహాయపడుతుంది అంటున్నారు మార్కెట్ నిపుణులు.




# హెచ్‌డిఎఫ్‌సిని కొనుగోలు చేస్తున్న ఐసిఐసిఐ?

**ముంబై, జూన్ 21:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు చెందిన మార్టిగేజ్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీని మరో ప్రైవేటురంగబ్యాంక్ ఐసీఐసీఐ కొనుగోలు చేయాలనుకుందా? అంటే అవుననే అంటున్నారు హెచ్‌డీఎఫ్‌సీ మాజీ ఛైర్మన్ దీపక్ పరేఖ్. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీవిలీనానికి ముందు ఈ ప్రతిపాదన తన వద్దకు వచ్చిందని చెప్పారు. ఐసీఐసీఐ మాజీ సీఈఓ చందాకొచ్చర్‌కు చెందిన యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఐసీఐసీఐ బ్యాంక్ సీఈఓగా చందాకొచ్చర్ ఉన్న సమయంలోనే ఈ ప్రతిపాదన రావడం గమనార్హం. బ్యాంకింగ్ వ్యవస్థతో పాటు పలు అంశాలపై చందా కొచ్చర్‌తో మాట్లాడిన పరేఖ్.. హెచ్‌డీఎఫ్‌సీ విలీన అంశం గురించి కూడా మాట్లాడారు. హెచ్‌డీఎఫ్‌సీని.. ఐసీఐసీఐ ప్రారంభించింది కదా! మరి మీరెందుకు మళ్లీ విలీనం చేయకూడదన్న ప్రశ్న మీ నుంచి వచ్చింది అంటూ నాటి రోజుల నుంచి గుర్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ విషయం గురించి తానెక్కడా మాట్లాడలేదని పేర్కొన్నారు. అప్పట్లో తిరస్కరించడానికి గల కారణాలను వివరించారు. విలీనం ఏమాత్రం సరికాదని నాడు తోసిపుచ్చా. మా పేరు, బ్యాంక్, ఇలా చాలా అంశాలు అందుకు కారణం అని పరేఖ్ పేర్కొన్నారు. 2009 నుంచి 2018 వరకు ఐసీఐసీఐ సీఈఓగా చందాకొచ్చర్ వ్యవహరించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ విలీనానికి ఆర్‌బీఐ కూడా ఎంతో సహకారం అందించిందని పరేఖ్ పేర్కొన్నారు. అలాగని, రాయితీలు, గడువు వంటి రూపంలో కాదన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో రివర్స్ మెర్జర్‌ను ఒక బాధాకర, ఆనందకరమైన రోజుగా అభివర్ణించారు. విలీనం సంస్థకు ప్రయోజనకరమని పేర్కొన్నారు. చైనాలో పెద్దపెద్ద బ్యాంకులు ఉన్నట్లు మన దేశంలోనూ ఆ తరహాబ్యాంకులు ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి బ్యాంకులతో పోటీ పడే విధంగా మన బ్యాంకులు అవతరించాలన్నారు. అందుకోసం బ్యాంకింగ్‌రంగంలో కన్సాలిడేషన్ జరగాలని అభిప్రాయపడ్డారు. బ్యాంకుల కొనుగోళ్ల ద్వారానే అది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశంలో బీమా రంగాన్ని సరిగా అర్థం చేసుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు.



# వాణిజ్యం

# హోండా స్పోర్ట్స్ ఎడిషన్ రిలీజ్..

**న్యూఢిల్లీ, జూన్ 21:** హోండా కార్స్ ఇండియా కొత్త సిటీ స్పోర్ట్ స్పెషల్ ఎడిషన్‌ను రూ.14.89 లక్షల (ఎక్స్ షోరూమ్) ధరకు అందుబాటులో ఉంచింది. ముఖ్యంగా ఈ కారులో యువతను ఆకర్షించేలా అవుటర్‌తో పాటు ఇంటీరియర్‌లో ప్రత్యేక మార్పులు చేశారు. న్యూ సిటీ స్పోర్ట్ ఎడిషన్ పరిమిత సంఖ్యలో అందుబాటులో ఉంటుంది. అలాగే ఈ విభాగంలో వోక్స్ వ్యాగన్ వర్టస్, స్కోడా స్లావియా, హ్యుందాయ్ వెర్నాతో పోటీ పడుతుందని నిపుణులు చెబుతున్నారు. సిటీ స్పోర్ట్ ఎడిషన్ సెడాన్‌కు సంబంధించిన అవుటర్ వ్యూ మాదిరి తీర్చిదిద్దారు. ముఖ్యంగా ఈ కారు క్రోమ్ గ్రిల్ నలుపు రంగులో ఆకట్టుకుంటుంది. అలాగే వెనుక స్పాయిలర్ కూడా ఆకర్షణీయంగా ఉంటుంది. ఓఆర్‌వీఎంలు క్రిస్టల్ బ్లాక్ ఫినిషింగ్‌తో వస్తున్నాయి. మల్టీస్పోక్ అల్లాయ్ వీల్స్ మెటాలిక్ గ్రే రంగులో ఆకట్టుకుంటుంది. షార్క్‌ఫిన్‌యాంటెన్నా కూడా గ్లోస్‌బ్లాక్ రంగులో డిజైన్ చేశారు. ముఖ్యంగా బూట్ పై 'స్పోర్ట్' చిహ్నం ఉంది. హోండా కార్స్ ఇండియా కొత్త సిటీ స్పోర్ట్ స్పెషల్ ఎడిషన్ క్యాబిన్ ఫుల్ బ్లాక్ ఇంటీరియర్‌తో వస్తుంది. అలాగే డాష్ బోర్డ్‌పై ఎరుపు రంగుతో ఉంటుంది. సీట్లు కాంట్రాస్ట్ ఎరుపు రంగు స్టిచింగ్‌తో బ్లాక్ లెథరెట్లో అప్హోల్స్టర్ చేశారు. కొత్త సాఫ్ట్ టచ్ డోర్ ఇన్సర్ట్లు ఆకట్టుకుంటాయి. అలాగే ఏసీ వెంట్స్, స్టీరింగ్ వీల్ కూడా నలుపు రంగులో ఉంటాయి. ఇక స్పెసిఫికేషన్ల విషయానికి వస్తే హెండా సిటీ స్పోర్ట్ ఎడిషన్ 119 బీహెచ్‌పీ గరిష్ట శక్తి 145 ఎన్ పీక్ టార్క్ ఉత్పత్తి చేసేలా 1.5 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్‌తో వస్తుంది.




# సిమ్‌కార్డు పొందాలంటే ఈ రూల్స్ తప్పదు..

**ముంబై, జూన్ 21:** భారత ప్రభుత్వం ఇటీవల ఒక ముఖ్యమైన నిర్ణయంతీసుకుంది. మొబైల్ నంబర్లు, వ్యాపార కాల్‌లకు కెవైసిని తప్పనిసరి చేసింది. టెలికాం రంగంలో పారదర్శకత, భద్రత, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో ప్రీపెయిడ్ వినియోగదారులకు కెవైసి సౌలభ్యం ఉండేది. ఇక్కడ వారు పూర్తి కెవైసి లేకుండా కూడా సిమ్ కార్డులను పొందవచ్చు. కానీ ఇప్పుడు అలా కుదరదు. కొత్త మార్గదర్శకాల ప్రకారం, వినియోగదారులు వారి గుర్తింపు, చిరునామా రుజువుతో కెవైసిని పూర్తి చేయాలి. ఈ ప్రక్రియను ఆఫ్‌లైన్‌లో (టెలికాం స్టోర్లలో) లేదా ఆన్‌లైన్‌లో (టెలికాం కంపెనీలవెబ్‌సైట్‌లు లేదా యాప్‌ల ద్వారా) పూర్తి చేయ వచ్చు. భద్రత, పారదర్శకతను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేవైసీ లేకుంటే ఉగ్రవాద నిధులు, మనీ లాండరింగ్, మోసం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలను అణిచివేస్తుంది. దీనితో పాటు, అన్ని మొబైల్ నంబర్లు నమోదిత వినియోగదారులకు అనుసంధానించబడి ఉన్నాయని నిర్ధారిస్తుంది. దీనివల్ల అత్యవసర సేవలు, ప్రభుత్వ పథకాలను సులభంగా యాక్సెస్ చేయవచ్చు. కొత్త విధానం వల్ల అతిపెద్ద ప్రభావం ప్రీపెయిడ్ వినియోగదారులపై ఉంటుంది. వారు ఇకపై కేవైసీ లేకుండా సిమ్ కార్డులను పొందలేరు. ఈ ప్రక్రియ కొంచెం తక్కువ సౌకర్యవంతంగా ఉంటుంది. కానీ దీర్ఘకాలంలో ఇది భద్రత, నమ్మకాన్ని పెంచుతుంది. ఇప్పటికే కెవైసి పూర్తి చేసిన పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు ఇబ్బంది ఉండదు. అయితే, వారు ఎప్పటికప్పుడు కేవైసీ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. కెవైసి ఎలా చేయాలి? కేవైసీని పూర్తి చేయడానికి సిమ్ కార్డు దారులు గుర్తింపు రుజువు (ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఓటరు ఐడి వంటివి) అందించాల్సి ఉంటుంది.



# 61 లక్షల యూజర్లను కాపాడిన ఎయిర్‌టెల్

**ముంబై, జూన్ 21:** దేశవ్యాప్తంగా ఎఐ ఆధారిత మోసాలను గుర్తించే వ్యవస్థను ప్రారంభించిన 37 రోజుల్లోనే ఝార్ఖండ్, బిహార్‌రాష్ట్రాల్లోని 6.1 మిలియన్ల మంది వినియోగదారులను ఆన్‌లైన్ మోసగాళ్ల బారినపడకుండా కాపాడినట్లు ఎయిర్‌టెల్ తెలిపింది. పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల నుంచి వినియోగదారులను రక్షించే చర్యల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు చెప్పింది. వినియోగదారులకు సైబర్ దాడుల నుంచి రక్షించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఫ్రాడ్ డిటెక్షన్ సిస్టమ్‌ను ఎయిర్‌టెల్ దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలని యోచించింది. అందులో భాగంగా ఎయిర్‌టెల్ ఈ విధానాన్ని ప్రారంభించిన 37 రోజుల్లోనే రెండు రాష్ట్రాల్లో 6.1 మిలియన్లకు పైగా వినియోగదారులను విజయవంతంగా రక్షించిందని ఒక ప్రకటనలో తెలిపింది. అధునాతనవ్యవస్థ ఎస్‌ఎంఎస్‌లు, సోషల్ మీడియా ఖాతాలు, ఇ-మెయిల్స్, ఇతర బ్రౌజర్లలోని లింక్‌లను స్కాన్ చేసి ఫిల్టర్ చేస్తుందని తెలిపింది. ఇది ప్రతి రోజూ ఒక బిలియన్‌యూఆర్ఎల్స్‌ను పరిశీలించడానికి రియల్ టైమ్ థ్రెట్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగిస్తున్నట్లు చెప్పింది. హానికరమైన సైట్ల నుంచి జరిగే ప్రమాదాన్ని గుర్తించి 100 మిల్లీ సెకన్లలో రక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొంది.




# లైఫ్‌టైమ్ దాటిన వాహనాలకు పెట్రోడీజిల్ బంద్

**న్యూఢిల్లీ, జూన్ 21:** ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఎఎన్‌పిఆర్) కెమెరాల ద్వారా గుర్తించి అన్ని వాహనాల లైఫ్ టైమ్ అయిపోయిన (ఎండ్ ఆఫ్ లైఫ్) వాహనాలను జూలై 1 నుండి ఢిల్లీలోని పెట్రోల్ బంకుల్లో ఇంధనం నింపడానికి అనుమతించబోమని కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యూఎం) ప్రకటించింది. 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్ వాహనాల జీవిత కాలం అయిపోయిన (ఇఎల్) వాహనంగా పరిగణిస్తారు. సిఎక్యూఎం ప్రకారం, ఈ నిషేధం నవంబర్ 1 నుండి గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్, సోనిపట్‌లకు విస్తరించనున్నారు. అలాగే ఏప్రిల్ 1, 2026 నుండి మిగిలిన ఎన్‌సిఆర్ ప్రాంతాలను కవర్ చేస్తుంది. ఢిల్లీలోని 500 ఇంధన కేంద్రాలలో ఎఎన్‌పిఆర్ కెమెరాలను ఏర్పాటు చేశామని, దీనివల్ల వాహన డేటా రియల్ టైమ్ ట్రాకింగ్ సాధ్యమవుతుందని సిఎక్యూఎం సభ్యుడు డాక్టర్ వీరేంద్ర శర్మ అన్నారు. ఇప్పటి వరకు ఈ వ్యవస్థ 3.63 కోట్లకుపైగా వాహనాలను తనిఖీ చేసిందని, వాటిలో 4.90 లక్షల వాహనాలను లైఫ్ టైమ్ నిలిచిపోయినట్లు గుర్తించామని చెప్పారు. 29.52 లక్షల వాహనాలు తమ కాలుష్యనియంత్రణ ధృవీకరణపత్రాన్ని (పియుసిసి) పునరుద్ధరించాయని, ఫలితంగా రూ.168కోట్ల విలువైన చలాన్లు జారీ చేసినట్లు శర్మ చెప్పారు. డేటాను పర్యవేక్షించడానికి ఎక్కువగా ఫ్లాగ్ చేయబడిన వాహనాలతో ఇంధన స్టేషన్లను గుర్తించడానికి కఠినమైన నిర్ణయాల అమలుకు ఢిల్లీ రవాణా శాఖ 100 ప్రత్యేక బృందాలను నియమించింది. ఢిల్లీ, ఎన్‌సిఆర్ పోల్యూషన్‌ను శుభ్రం చేయడానికి పాత బీఎస్ ప్రమాణాల వాహనాలను తొలగించడం చాలా ముఖ్యం అని శర్మ అన్నారు. వాయు కాలుష్యంలో ఈ వాహనాలు పెద్ద పాత్ర పోషిస్తాయి. ఇప్పుడు పారదర్శకమైన, డిజిటల్, జవాబుదారీ వ్యవస్థ అమలు చేసినందున ఈ వ్యవస్థను మరింత ప్రభావవంతంగా చేయడానికి టోల్ కేంద్రాలలో కూడా దీనిని ఉపయోగిస్తారు. దీని కోసం సుమారు 100 అమలు బృందాలు పని చేస్తాయి. వాహనాలు ఇంధన స్టేషన్ల వద్దకు చేరుకున్నప్పుడు ఎఎన్‌పిఆర్ వ్యవస్థ స్వయంచాలకంగా లైసెన్స్ ప్లేట్ నంబర్‌లను స్కాన్ చేస్తాయి. ఇది వాహన డేటాబేస్‌తో డేటాను క్రాస్‌రిఫరెన్స్ చేస్తుంది. ఇది రిజిస్ట్రేషన్ వివరాలు, ఇంధన రకం, వాహనం వయస్సు వంటి సమాచారాన్ని సేకరిస్తుంది. ఒక వాహనం చట్టపరమైన కాలపరిమితికంటే ఎక్కువగా ఉన్నట్లు తేలితే, దానిని ఎండ్ ఆఫ్ లైఫ్‌గా గుర్తిస్తారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No. B-11, B-12, Industrial Estate, Anantapur.-515004. Phone:9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No.70088/97. Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.No. HSD/337/18-20 Air Surcharge: Delhi: 40 Ps.